
సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 90% హామీలు నెరవేర్చి, పింఛన్లు, తల్లికి వందనం, దీపం-2, అన్న క్యాంటీన్లు, ఉపాధ్యాయ నియామకాలతో పాటు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులను ఆదుకుంటోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 09.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 173 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# భారీ పెట్టుబడి

### దేశ చరిత్రలో ఏపీకి అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి

### రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటు

### రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపీబీ ఆమోదం

### 26 ప్రాజెక్టుల ద్వారా 67,218 మందికి ఉద్యోగ అవకాశాలు

### మెగా ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షించింది. అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. రూ.87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లి వద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దాదాపు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశం..ఇంధన రంగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఏరో స్పేస్, ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగాలతో పాటు పర్యాటకానికి ఊతం ఇచ్చేలా ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలియచేసింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఏపీకి సాధించటంపై ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు అభినందనలు తెలియచేశారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే డేటా సెంటర్లు ఏపీకి టెక్నాలజీ గేమ్ చేంజర్‌గా మారతాయని అన్నారు. కేవలం 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డేటా సెంటర్లతో ఓ ఎకో సిస్టం వస్తోందని.. విశాఖ నగరం తదుపరి స్థాయి ఏఐ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ తక్కువ ధరకు అందిస్తే ఐటీ రంగానికి మేలు జరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 6.20 లక్షల మందికి నేరుగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

**ప్రాంతాల వారీగా పారిశ్రామిక ప్రాజెక్టుల అభివృద్ధి :** క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న ఈ డేటా సెంటర్లు టెక్నాలజీ రంగంలో కీలక మలుపు అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. విశాఖ పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎకనమిక్ కారిడార్ తరహాలోనే రాయలసీమకూ ఓ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. ఆమేరకు మూడు ప్రాంతాలను పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నామని అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకూ ఒక ఆర్థిక ప్రగతి రీజియన్‌ను , నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో ఎకనామిక్ డెవలప్మెంట్ రీజియన్లను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ , డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు అభివృద్ధి అవుతున్నాయని సీఎం అన్నారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా ఉన్న రాయలసీమ ఆగ్రో ప్రాసెసింగ్ హబ్‌గా మారుతోందని త్వరలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేంద్రంగా ఈ ప్రాంతం మారుతుందని అన్నారు. అమరావతి రాజధాని నగరం క్వాంటం వ్యాలీతో నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును కూడా అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీని కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసుకుని ప్రాజెక్టులను ఆహ్వానించాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రైల్వే లైన్‌కు కూడా అనుసంధానిస్తే లాజిస్టిక్స్ వ్యయం తగ్గి ఆయా ప్రాజెక్టులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విలువ జోడింపుపైనా దృష్టి పెట్టాలని అన్నారు.

మిగతా 2లో...

## పాక్‌పై ఎందుకు దాడి చేయలేదు



**ముంబయి :** కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ మరోసారి విరుచుకుపడ్డారు. 2008 ఉగ్రదాడికి దీటుగా ప్రతిస్పందిచలేదని ఆరోపిస్తూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. విదేశీ ఒత్తిడి వల్లే కాంగ్రెస్ వెనక్కి తగ్గిందన్నారు. నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం తర్వాత మాట్లాడిన మోదీ.. ఆ సమయంలో ఎవరు నిర్ణయం తీసుకున్నారో కాంగ్రెస్ సమాధానం చెప్పాలన్నారు.

"ముంబయి ఆర్థిక రాజధాని మాత్రమే కాదు.. దేశంలో అత్యంత శక్తిమంతమైన నగరాల్లో ఒకటి. అందుకే ఉగ్రవాదులు ఈ నగరంపై దాడి చేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనతను ప్రదర్శించింది. ఉగ్రవాదులకు బలంగా మారింది. 2008 ముంబయి దాడుల తర్వాత పాకిస్థాన్‌పై దాడి చేసేందుకు మన భద్రతా దళాలు సిద్ధంగా ఉన్నప్పటికీ.. విదేశాల ఒత్తిడితో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం సైనిక చర్యను అడ్డుకుంది. ఇదే విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ హోంమంత్రి ఇటీవల వెల్లడించారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలి. ఈ తప్పిదానికి దేశం ఎంతో మందిని కోల్పోవాల్సి వస్తోంది. పౌరుల రక్షణ, జాతీయ భద్రత కంటే ఏదీ ఎక్కువ కాదు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

మిగతా 2లో...

## చర్చించి.. పరిష్కరించుకుందాం

- ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- చర్చించుకుని మన సమస్యలను మనమే పరిష్కరించుకుందాం
- ఏపీలో విద్యావ్యవస్థను నెం.1గా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం
- ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలి
- అంతర్ జిల్లా బదిలీల ఉపాధ్యాయులు, భాషా పండితులతో సమావేశంలో మంత్రి నారా లోకేష్
- సమస్యల పరిష్కారానికి కృషిచేసినందుకు మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు తెలిపిన ఉపాధ్యాయులు




**ఉండవల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చించుకుని మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు అంతర్ జిల్లా బదిలీల ఉపాధ్యాయులు, భాషా పండితులతో మంత్రి సమావేశమయ్యారు. టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను (మ్యూచువల్, స్పౌజ్) విజయవంతంగా నిర్వహించడంతో పాటు ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న భాషా పండితుల సమస్యను పరిష్కరించడం పట్ల మంత్రి నారా లోకేష్ ను ప్రత్యేకంగా కలిసి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తిచేశాం. వచ్చే నాలుగేళ్ల పాటు ఫలితాలపైనే దృష్టిసారిస్తాం. గత ప్రభుత్వం మాదిరిగా విద్యార్థులను డ్రాప్ బాక్స్ లో పెట్టి దొంగలెక్కలు చూపబోం. పారదర్శకంగా వ్యవహరిస్తాం. విద్యాశాఖను ఛాలెంజింగ్ గా తీసుకున్నాం. ఏపీలో విద్యావ్యవస్థను నెం.గా తీర్చిదిద్దాలనేదే లక్ష్యం. ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించాలి.

మిగతా 2లో...

## ఏడుగురు సజీవ దహనం



### కోనసీమ జిల్లాలో భారీ విస్పోటనం


### బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు

### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పవన్, లోకేష్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** కోనసీమ జిల్లాలో ఒక బాణసంచా తయారీ కేంద్రంలోబుధవారం జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బుధవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో పేలుడు సంభవించింది. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఈ ఘటనలో మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది

మిగతా 2లో...

## రసాయనశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రసాయన శాస్త్రంలో విశేష పరిశోధనలు జరిపిన ముగ్గురు శాస్త్రవేత్తలకు ఈ ఏడాది నోబెల్ బహుమతి లభించింది. మెటల్-ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ అభివృద్ధి చేసినందుకు గాను సుసుము కిటాగవా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం యాఘీలకు ఈ పురస్కారాన్ని అందించనున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది. వీరు కొత్తరకం మాలిక్యూలర్ ఆర్కిటెక్చర్ అభివృద్ధి చేసినట్లు తెలిపింది.

గతేడాది ముగ్గురికి ఈ అవార్డు దక్కింది. ప్రొటీన్లపై విశేష పరిశోధనలు చేసిన డేవిడ్ బేకర్, డెమిస్ హసాబిస్, జాన్ జంపర్‌లు ఈ పురస్కారం అందుకున్నారు. మొత్తంగా 1901-2024 మధ్యకాలంలో 116 సార్లు రసాయన శాస్త్రంలో నోబెల్‌ను ప్రకటించగా ఇప్పటివరకు 195 మంది దీనిని అందుకున్నారు. వీరిలో జాన్ బీ గూడ్‌ఎనఫ్ 97 ఏళ్ల వయసులో కెమిస్ట్రీలో పురస్కారం అందుకున్న వృద్ధుడిగా నిలువగా.. ఫ్రెడెరిక్ జొలియట్ 35ఏళ్ల వయసులో నోబెల్ అందుకున్న అతిపిన్న వయస్కుడిగా నిలిచారు. ఇక ఫ్రెడరిక్ సాంగెర్, బ్యారీ షార్ప్‌లెస్‌లు రసాయన శాస్త్రంలో రెండుసార్లు నోబెల్ అందుకోవడం విశేషం.

మరోవైపు సోమవారం (అక్టోబర్ 6న) మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన అక్టోబర్ 13 వరకు కొనసాగనుంది. తొలుత వైద్యశాస్త్రంలో, మంగళవారం భౌతికశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. నేడు రసాయనశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లు వెల్లడించారు. గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి, అక్టోబర్ 13న అర్థశాస్త్రంలో ఈ పురస్కారం అందుకోనున్న వారి పేర్లను ప్రకటిస్తారు. ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజైన డిసెంబర్ 10న విజేతలకు అవార్డులను అందజేస్తారు.

## జగన్‌కు కనువిప్పు కలగాలి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం నర్సీపట్నం పర్యటన సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం విషయంలో ఆయనపై వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ వాస్తవాల ఆధారంగా ధ్వజమెత్తారు. ఈ పర్యటన జగన్‌రెడ్డికి కనువిప్పు కావాలని మంత్రి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నిర్మాణాలు ప్రారంభమైన ఏ ఒక్క కాలేజీనీ ఎన్నడూ సందర్శించని, నత్తనడకన సాగిన పనుల తీరును ఏనాడూ సమీక్షించని మాజీ సిఎం నర్సీపట్నం కాలేజీ పనుల తీరును స్వయంగా చూసి, తన నిర్వాకాన్ని గమనించి చెంపదెబ్బలేసుకుని, ఆ ప్రాంత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. ఆయన నిర్లక్ష్యం, నిర్వాకాల వల్లే కొన్ని కాలేజీల నిర్మాణాన్ని పిపిపి విధానంలో చేపట్టాల్సిన పరిస్థితి ఎదురైందని మంత్రి స్పష్టం చేశారు.


**జగన్ పర్యటనను ఆహ్వానిస్తున్నాను..! :** అధికారంలో ఉన్నంతకాలం వెనుకబడ్డ ప్రాంతమైన నర్సీపట్నంలో చేపట్టిన వైద్య కళాశాల పనులను ఏనాడూ కనీసం సమీక్షించి వేగవంతం చేయాలని ఆదేశించని మాజీ సిఎం జగన్ ఇప్పుడు పర్యటించడాన్ని తాను ఆహ్వానిస్తున్నానని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ తెలిపారు. భారీ ఓటమిని మూటకట్టుకున్న 16 నెలల తర్వాత చేపట్టిన ఈ పర్యటన ద్వారా వాస్తవాల్ని తెలుసుకుని ఆయనలో కనువిప్పు కలిగితే తాను ఎంతగానో సంతోషిస్తానని మంత్రి వెల్లడించారు. అయితే జగన్‌రెడ్డి మానసికత ఇందుకు పూర్తిగా భిన్నమని, అసత్యాలే ఆధారంగా రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలని చూసే మాజీ సిఎంలో ఈ మార్పును ఆశించడం అత్యాశే అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

మిగతా 8లో...

## జిల్లాల పునర్విభజనలో

# వీడని సందిగ్ధం..!

- జోరుగా విభజన విజ్ఞప్తులు
- అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్న అధికారులు
- మంత్రివర్గ ఉప సంఘం సమావేశం కోసం ఎదురుచూపు
- డిసెంబర్ 31 నాటికి సరిహద్దుల వివరాలు పంపాలంటున్న కేంద్రం
- జాప్యం లేకుండా చూడాలంటున్న కేంద్రం
- కూటమి నేతల నుంచి విజ్ఞప్తుల వెల్లువ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) :** రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన విభజన వ్యవహారంపై కూటమి ప్రభుత్వంలో తర్జనభర్జన కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దీనిపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘానికి కొన్ని జిల్లాల ప్రజా ప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. కొంతమంది ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాన్ని ఇప్పుడున్న జిల్లాలోని కొనసాగించాలని,

మిగతా 2లో...

## పాక్‌పై ఎందుకు దాడి చేయలేదు

(మొదటి పేజీ తరువాయి)

పాకిస్థాన్‌పై ప్రతీకార చర్యలకు దిగకూడదని అంతర్జాతీయంగా ఒత్తిడి వచ్చిందని ఓ ఇంటర్వ్యూలో మాజీ హోంమంత్రి పీ చిదంబరం అంగీకరించడం ఇటీవల చర్చనీయాంశమైంది. యుద్ధం మొదలుపెట్టవద్దని అమెరికా కూడా నాటి కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి సూచించిందన్నారు. చిదంబరం చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ పరోక్షంగా ప్రస్తావిస్తూ కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తారు.

# భారీ పెట్టుబడి!



(మొదటి పేజీ తరువాయి)

ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు నాణ్యమైన వసతి లభించేలా చూడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వివిధ కేటగిరీల హోటళ్లకు అనుబంధంగా ఎకో సిస్టం కూడా వచ్చేలా చూడాలని సూచించారు. తిరుపతిలో ఉన్న కలినరీ ఇనిస్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచి వివిధ సంస్థలను అనుసంధానించాలని పేర్కొన్నారు. కూచిపూడి, థింసా లాంటి సంప్రదాయాలతో పాటు వివిధ ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల విజయం సాధించిన విజయవాడ ఉత్సవ్ తరహాలోనే విశాఖ, రాజమహేంద్రవరం లాంటి చోట్ల కూడా ఉత్సవ్‌లను నిర్వహించాలని సూచించారు.

**మెగా పారిశ్రామిక ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు :** అమెరికాలో వర్జీనియా నగరం డేటా వ్యాలీగా ఉందని.. ప్రస్తుతం విశాఖ కూడా రైడెన్, గూగుల్ ప్రాజెక్టులతో డేటా వ్యాలీగా రూపొందుతుందని ఐటీ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రికి వివరించారు. టీసీఎస్ సంస్థ కూడా ఇక్కడ త్వరలోనే క్యాంపస్‌ను ప్రారంభించనుందని.. ఒక్క విశాఖ నగరంలోనే 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. ఐటీ సంస్థల్లు, అందులో పనిచేసే ఉద్యోగులకు హౌసింగ్‌తో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతులు ఉండేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌తో స్థానిక టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. వీటితో పాటు 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రామాయపట్నం సమీపంలో వస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీతో పాటు ఆర్సెలార్ మిట్టల్, రైడెన్ డేటా సెంటర్ లాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యే వరకూ పర్యవేక్షణ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించాలని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు లాజిస్టిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నీటి సరఫరా, వినియోగం లాంటి అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. 2028 నాటికల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసేలా చూడాలని సీఎం పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, కె.అచ్చెన్నాయుడు, పి.నారాయణ, టీజీ భరత్, కందుల దుర్గేష్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు సీఎస్ కె.విజయానంద్, పరిశ్రమలు, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**11వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు ఇవీ :**

1. యాక్మే ఊర్జా ఒన్ లిమిటెడ్ – అనంతపురం జిల్లాలో సౌర విద్యుత్ ప్రాజెక్టులో రూ.2 వేల కోట్ల పెట్టుబడి, 1380 మందికి ఉద్యోగాలు
2.టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ అనంతపురం జిల్లాలో 400 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు రూ.2 వేల కోట్ల పెట్టుబడి, 1,380 మందికి ఉద్యోగాలు
3.చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ విజయనగరం జిల్లాలో పంప్డ్ ఎనర్జీ ప్రాజెక్టు రూ.12,905 కోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాలు
4.ఆంప్లిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సౌరవిద్యుత్ ప్రాజెక్టు రూ.15.10 కోట్లు పెట్టుబడి
5. రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ కర్నూలు జిల్లా ఓర్వకల్లు లో ఎఫ్ఎంసీజీలో రూ.758 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు
6. గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ రూ.208 కోట్ల పెట్టుబడులు, 66 మందికి ఉద్యోగాలు
7.ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ రూ.201 కోట్ల పెట్టుబడి, 436 మందికి ఉద్యోగాలు
8.ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.33 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు
9.దస్పల్లా అమరావతి హోటల్స్ అమరావతిలో రూ.200 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు
10.వీఎస్కే హోటల్స్ రిసార్ట్స్ అరకు వ్యాలీలో రూ.55 కోట్ల పెట్టుబడి, 98 మందికి ఉద్యోగాలు
11.శ్రీవేంకటేశ్వరా లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ శ్రీశైలంలో రూ.83 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
12. సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అమరావతిలో రూ.117 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగాలు
13.. మైరా బే వ్యూ రిసార్ట్స్ కొత్తవలసలో కన్వెన్షన్ సెంటర్ కు రూ.256 కోట్ల పెట్టుబడి
14.ఎస్వీఎస్ కనస్ట్రక్షన్స్ కాకినాడ లో రూ.87 కోట్ల పెట్టుబడి,
15.రైడన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ డేటా సెంటర్ ఏర్పాటుకు రూ.87,520 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు.
16. ఇమాజినేటివ్ టెక్నో సొల్యూషన్స్ ఇండియా విశాఖ కాపులుప్పాడ లో ఐటీ లాజిస్టిక్స్ రూ.140 కోట్ల పెట్టుబడి, 2600 మందికి ఉద్యోగాలు
17. శాన్వీరా ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనకాపల్లిలో అడ్వాన్స్డ్ కార్బన్ కాంప్లెక్స్ రూ.2600 కోట్ల పెట్టుబడి, 800 మందికి ఉద్యోగాలు
18. శ్రీ సిమెంట్ లిమిటెడ్, పలనాడులో సిమెంట్ ఫ్యాక్టరీ విస్తరణ రూ.2260 కోట్ల పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు
19.రేమండ్, జేకే మైనీ ప్రెసిషన్ టెక్నాలజీ అనంతపురంలో ఏరో స్పేస్ ఆటోమోటివ్ కాంపోనెంట్ రూ.430 కోట్ల పెట్టుబడి, 4,096 మందికి ఉద్యోగాలు
20. రేమాండ్ జేకే మైనీ గ్లోబల్ ఎరోస్పేస్ లిమిటెడ్, అనంతపురంలో ఏరోస్పేస్ కాంపోనెంట్లు రూ.510 కోట్ల పెట్టుబడి, 1400 మందికి ఉద్యోగాలు.
21. భారత్ డైనమిక్స్ లిమిటెడ్, ప్రకాశం జిల్లా దొనకొండ వద్ద రూ.1200 కోట్ల పెట్టుబడి, 1400 మందికి ఉద్యోగాలు
22. అలీప్ ఓర్వకల్లు వద్ద మహిళా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కోసం రూ.36.25 కోట్ల పెట్టుబడి, 3000 మందికి ఉద్యోగాలు

# రైతులకు మేలు జరగాలి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి అభివృద్ధితో పాటు... రాజధానికి భూములిచ్చిన రైతులు కూడా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను తక్షణం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 53వ సీఆర్డీఏ అథార్టీ సమావేశం జరిగింది. మొత్తంగా 18 అంశాలపై అథార్టీ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాజధాని నిర్మాణ పనులు రీ–స్టార్ట్ చేశాం. రాజధాని కోసం భూములను త్యాగం చేసిన రైతులకే మొదటగా రాజధాని అభివృద్ధి ఫలాలు అందాలి. రాజధాని రైతులకు కౌలు చెల్లింపుల్లోనూ ఎలాంటి జాప్యం జరగకూడదు. భూములిచ్చిన రైతులకు ఎక్కడ రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని చెప్పామో... అక్కడే ఇవ్వాలి. ఏ ఊళ్లో భూములిచ్చిన వారికి ఆ ఊళ్లోనే ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చాం.. అలాగే ఎలాట్మెంట్ చేయాలి. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెరగాలి. సెక్రటేరియేట్ టవర్లతో సహా ఇతర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. వెస్ట్ బైపాస్ రోడ్డును వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ఏమైనా సాంకేతిక ఇబ్బందులుంటే.. వాటిని వెంటనే పరిష్కరించుకుని ఖాజా టోల్ గేట్ దగ్గర జాతీయ రహదారిని చేరేలా ఉన్న రోడ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి. కరకట్ట



రోడ్డును విస్తరించాలి. మూడు నెలల్లో రాజధాని నగరాన్ని ఓ రూపునకు తీసుకురావాలి." అని సీఎం చెప్పారు.

**రాజ్ భవన్ సహా వివిధ నిర్మాణలకు ఆమోదం :** అమరావతిలో గవర్నర్ నివాసం రాజ్ భవన్ నిర్మాణానికి సీఆర్డీఏ అథార్టీ ఆమోదించింది. రూ. 212 కోట్ల వ్యయంతో రాజ్ భవన్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. కృష్ణా నదీ ఒడ్డున అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా రాజ్ భవన్ నిర్మాణం జరగనుంది. రాజ్ భవన్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ అద్భుతంగా ఉండాలని సీఎం సూచించారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 25 శాతం నిధులను సీఆర్డీఏ ఇచ్చేందుకు అథార్టీ ఆమోదం తెలిపింది. రాజధాని ప్రాంతంలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి అథార్టీ అంగీకరించింది. రాజధాని నగర జోనింగ్ నిబంధనల్లో గ్రీన్ సర్టిఫైడ్ భవనాలు ఉండేలా అవసరమైన మార్పులు చేర్పులు అథార్టీ ఆమోదించింది. అమరావతి క్యాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఎగ్జిక్యూటీవ్ ఏజెన్సీగా సీఆర్డీఏ వ్యవహరించేలా అథార్టీలో నిర్ణయించారు. హ్యాపీ నెస్ట్, ఏపీ ఎన్నార్టీ ప్రాజెక్టులకు చెందిన బిల్డింగ్ పర్మిషన్ ఫీజును మాఫీ చేసేందుకు అథార్టీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధానిలో నిర్మించే హోటళ్ల వద్ద పార్కింగ్ నిబంధనల్లోనూ స్వల్ప మార్పులు చేసేందుకు అథార్టీ అంగీకరించింది. కొండవీడు వాగు సమీపంలో నీటి ప్రవాహాల కోసం 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అథార్టీ నిర్ణయించింది. దీంతో పాటు మరికొన్ని సాంకేతిక అంశాలకు, పరిపాలనా అంశాలకు అథార్టీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సీఎం కొన్ని సూచనలు చేశారు. భవిష్యత్తులో వాహనాల సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉందని... పార్కింగ్ సమస్య లేకుండా ప్రణాళికలు చేయాలని సూచించారు. అమరావతి రాజధానిలో రోడ్డుపై వాహనాల పార్కింగ్ చేసే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. కామన్ పార్కింగ్ ప్రాంతాలు ఉండేలా ప్రణాళికలు చేయాలని సీఎం అధికారులకు చెప్పారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి–తాడేపల్లి కార్పోరేషన్లు, తెనాలి మున్సిపాలిటీ, రాజధాని ప్రాంతంతో ఇంటిగ్రేట్ చేయాలని... బ్లూ గ్రీన్ అమరావతిగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఆర్డీఏ అథార్టీ సమావేశానికి మంత్రి నారాయణ, సీఎస్ కె.విజయానంద్, సీఆర్డీఏ, ఏడీసీ, మౌలికసదుపాయాల కల్పన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# చర్చించి.. పరిష్కరించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

అభ్యసన ఫలితాల్లో విద్యార్థులు వెనుకబడి ఉన్నారు. దీనిని అధిగమించేందుకు కృషిచేస్తున్నాం. 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశాం. ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా నిర్వహించాం. విద్యావ్యవస్థలో మార్పునకు మీ అందరి సహకారం కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

**విద్యార్థులకు బాగా చదువు చెబితే అదే పెద్ద గిఫ్ట్ :** టీచర్ల అంతర్ జిల్లా బదిలీలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు భాషా పండితులకు పదోన్నతులు కల్పించిన మంత్రి నారా లోకేష్ కు ధన్యవాదాలు తెలిపేలా రాష్ట్రవ్యాప్తంగా 'థాంక్యూ లోకేష్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఉపాధ్యాయులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు మంత్రి స్పందిస్తూ.. అలాంటి కార్యక్రమాలేవీ వద్దని, విద్యార్థులకు చదువు బాగా చెబితే అదే పెద్ద గిఫ్ట్ అని వారితో చెప్పారు.

**బి.లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయురాలు :** నేను ఏలూరు జిల్లాలో ఎస్జీటీ గా పనిచేస్తున్నాను. అయితే నా భర్త కడపలో పనిచేస్తున్నారు. ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయిన వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ.. గత ఐదేళ్లుగా మేం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. బదిలీ కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా సక్సెస్ కాలేకపోయాం. ఇక బదిలీ కాదు అనే స్థిర



నిర్ణయానికి వచ్చాం. ఈ సమయంలో భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిగారి కలిసి మా సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లాం. ధైర్యంగా ఉండాలని, విద్యాశాఖ మంత్రి గారు కచ్చితంగా అంతర్ జిల్లా బదిలీలు చేస్తారని చెప్పారు. అనుకున్నట్లుగానే అంతర్ జిల్లాల బదిలీలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చారు. అంతర్ జిల్లాల బదిలీలు అంటే చాలా ప్రాసెస్ ఉంటుంది. ఎన్నో ఏళ్లు పడుతుంది. ఎప్పటికో అవుతుందిలే అని భావించాం. నిర్దిష్ట సమయంలోనే నోటిఫికేషన్ రావడం, జీవో రావడం జరిగిపోయింది. మేం స్కూల్ లో కూడా జాయిన్ అయ్యాం. ఇవాళ చాలా సంతోషంగా ఉంది. మీకు కృతజ్ఞతలు చెప్పుకోవడానికి వచ్చాం. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

**ఏ.కొండయ్య, భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు :** భాషా పండితులకు పదోన్నతలు కల్పించి.. విజయదశమి రోజున మా జీవితాల్లో వెలుగులు నింపారు. మీకు కృతజ్ఞతలు. దశాబ్దాల కలను సాకారం చేశారు.

ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసరాజు, జనరల్ సెక్రటరీ బి.హైమారావు, ఫైనాన్షియల్ సెక్రటరీ జే.శ్రీనివాస్, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షులు సంపత్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఏడుగురు సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అయితే రాయవరం బాణసంచా దుర్ఘటనలో శ్రీ గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి మృతి చెందినట్లు గుర్తించారు. ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

**సంఘటనా స్థలికి అనపర్తి ఎమ్మెల్యే :** మరోవైపు ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలు సరిహద్దులో ఈ ఘటన జరిగిందన్నారు. 70 సంవత్సరాలుగా బాణాసంచా తయారీలో శ్రీ లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్ వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తికి అనుభవం ఉందన్నారు. ఆయన కూడా ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నిబంధనలన్నీ కచ్చితంగా పాటించారని ఇటీవల అధికారుల తనిఖీల్లో వెల్లడయిందన్నారు. అయినప్పటికీ ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు


**క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి: మంత్రి నారా లోకేష్**

బాణసంచా తయారీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంపై మంత్రి లోకేష్ స్పందించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడు ఘటనలో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం పాలవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మంటల్లో చిక్కుకుని కార్మికులు సజీవ దహనం కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే ఆరా తీసిందని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**బాణాసంచా ప్రమాదం ఆవేదన కలిగించింది :** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం పాలయ్యారని తెలిసి ఆవేదన కలిగించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానన్నారు. ఈ ప్రమాదంపై జిల్లా అధికార యంత్రాంగం నుంచి వివరాలు అందాయి. ఈ దురదృష్టకర ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. దీపావళి సమయంలో బాణాసంచా తయారీ కేంద్రాల్లో, సంబంధిత గోదాముల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలి. మృతుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసాగా ఉంటుందన్నారు.

## పది రోజుల్లో ఆటోనగర్ అభివృద్ధి పనులు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆటోనగర్ ప్రాంత అభివృద్ధి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. మరో పది రోజుల్లో రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతాం. అభివృద్ధికి పనులకు స్థానికులు సహకరించాలి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం ఏపీ ఇండస్ట్రియల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహారావుతో కలిసి ఆటోనగర్ ప్రాంతంలో పర్యటించారు. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో స్థానికులతో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణల కారణంగా శానిటేషన్ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో యూనియన్ నాయకులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇండస్ట్రియల్ క్లస్టర్లు ఏర్పాటు చేసిందని, దీని ద్వారా అన్ని మౌలిక వసతులు కల్పించనుందని తెలిపారు. ఆటోనగర్ ప్రాంతంలో సుమారు 30 వేల మంది పనులు చేస్తుంటారని అన్నారు. ఇక్కడ కచ్చా డ్రెయిన్లు, వీధి దీపాలు, వెట్ మిక్స్ రోడ్ల నిర్మాణం వెంటనే చేపడతామని వెల్లడించారు. పూర్తి స్థాయి అభివృద్ధికి సుమారు కోటి రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నామని, అయితే ప్రస్తుతం రూ.50 లక్షలతో పనులు చేపట్టనున్నామని తెలిపారు. స్థానిక వ్యాపారులు తమ టైర్లు, ఇతర వాహనాలను రోడ్లపై ఉంచుతున్నారని, శానిటేషన్, రోడ్ల నిర్మాణం



వంటి పనులకు అడ్డంకిగా ఉంటాయని చెప్పారు. వెంటనే వీటిని తీసివేస్తే అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతాయని వెల్లడించారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఆటోనగర్ ను మరింత పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లే బాధ్యత తనదని స్పష్టం చేశారు.

## జిల్లాల పునర్విభజనలో వీడని సందిగ్ధం..!

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దులు, పేర్లు మార్చవద్దని ప్రతిపాదన చేస్తున్నట్లు తెలిసింది. మరి కొంతమంది సరిహద్దులు, మండలాలు, నియోజకవర్గాలను మార్చాలని కోరుతున్నారు. కొన్ని జిల్లాలకు కొత్త పేర్లు పెట్టాలి ప్రతిపాదన కూడా ఉప సంఘం దగ్గరకు వచ్చింది. జిల్లాలకు పేరు మార్పు సరిహద్దులు మార్పు వంటి అంశంపై ప్రభుత్వం ఇప్పటికే రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్య ప్రసాద్ మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. తాజా సమాచారం ప్రకారం ఈ ఉప సంఘం ఇంతవరకు జిల్లాల పునర్విభజనకు సంబంధించిన పనులు ప్రారంభించలేదని సమాచారం. మంత్రివర్గ ఉప సంఘం సూచనల మేరకు కీలకమైన అధికార యంత్రాంగం దీనిపై కసరత్తు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. మంత్రివర్గ ఉప సంఘం ఇంతవరకు పనులు ప్రారంభించక పోవడంపై పలు కారణాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన సమయం తక్కువగా ఈ లోగా పునర్విభజన, సరిహద్దుల నిర్ణయం, కొన్నిచోట్ల పేర్లు మార్పు, కొన్ని నియోజకవర్గాల్లో కొత్త గ్రామాలను కలపటం, కొన్నింటిని ఒక నియోజకవర్గం నుంచి మరో నియోజకవర్గానికి మార్పు చేయాలంటే కొంత సమయం పడుతుందని భావిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఏడాది డిసెంబర్ నాటికి జిల్లాల సరిహద్దులు అదేవిధంగా మండలాల సరిహద్దులు పోలీస్ స్టేషన్ల సరిహద్దులు నిర్ణయించి తమకు పంపాలని కేంద్ర గణాంక శాఖ అన్ని రాష్ట్రాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. అందులో ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది. కేంద్ర ప్రభుత్వానికి నిర్ణయించిన గడువులోగా వివరాలు పంపనట్లయితే ఈ ఏడాది డిసెంబర్ 31 నాటికి ఉన్న సరిహద్దులను మాత్రమే మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని జారీ చేసిన ఉత్తర్వులలో పేర్కొన్నట్లు చెబుతున్నారు. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు సంవత్సరాల వరకు సరిహద్దులు ,, జిల్లాలు , మండలాల పేర్లు మార్చడానికి వీలులేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఉత్తర్వులు వచ్చి దాదాపు దాదాపు రెండు నెలలు పూర్తయిందని రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. ఈ తరుణంలో నే రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో మంత్రుల కమిటీ దీనిని సమీక్షించి నిర్ణయం తీసుకుంటుందని గత క్యాబినెట్ సమావేశంలో చెప్పారు.కానీ, ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో దీనిపై ఎలాంటి చర్చ జరగలేదని వార్తలు వస్తున్నాయి. క్యాబినెట్ సమావేశంలో దీనిపై చర్చ జరిగినట్లయితే కొంతవరకు పురోగతి ఉందని భావించేవారు. ప్రస్తుతం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అసలు జిల్లాల విభజన గాని జిల్లాల గురించిన సమస్యలు గానీ జిల్లాలపై ఎట్లా ముందుకు వెళుతున్నారనే విషయాన్ని గాని సీఎం గాని డిప్యూటీ సీఎం కానీ ఎవరూ స్పందించలేదు. అంటే దీనిని బట్టి అసలు అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘం జిల్లాల విషయంపై ఇప్పటివరకు దృష్టి పెట్టలేదని తెలుస్తోంది. జిల్లాల పునర్విభజన వ్యవహారంలో కొన్ని జిల్లాలకు సంబంధించి సమస్యలు వస్తున్నట్లు కూడా తెలుస్తోంది. ఆయా జిల్లాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు మార్పులపై చేస్తున్న కొన్ని విజ్ఞప్తుల ను పరిగణలోకి తీసుకుంటే కష్టతరంగా ఉంటాయని అధికారులు భావిసున్నట్లు చెబుతున్నారు. కొన్నిచోట్ల ఎక్కడికక్కడ కొత్త సమస్యలు ప్రభుత్వానికి వస్తున్నాయి. కొందరు జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేయాలని కోరుతుంటే మరికొందరు జిల్లాల పేర్లను మార్చాలని కోరుతున్నారు. అయితే వీటికి వ్యతిరేకంగా అదే జిల్లాల నుంచి మరికొందరు వాదన వినిపిస్తున్నారు. వీరంతా కలిసి ఒకే పార్టీకి చెందిన వారై ఉండడం వీరందరూ స్థానికంగా బలమైన నాయకులై ఉండడం బలమైన సామాజిక వర్గాలకు చెందిన నాయకులు ఉండటంతో ప్రభుత్వానికి ఇప్పుడు ఏం చేయాలానే ప్రశ్న ఎదురవుతోంది. దీంతో అసలు జిల్లాల పునర్ విభజన, లేకపోతే మండలాల విభజన అనే ప్రక్రియను దాదాపు పక్కన పెట్టేశారా అనే చర్చ కూడా నడుస్తోంది. ఇప్పుడు గనక ఈ విషయాన్ని పక్కన పెట్టేస్తే ఖచ్చితంగా రెండు సంవత్సరాల వరకు ప్రభుత్వానికి అవకాశం లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి కుల గణన జరుగుతుంది. 2027లో జనాభా గణన ప్రారంభమవుతుంది. ఈ రెండు అయ్యే సరికి 2028 దాకా సమయం పడుతుంది. అంటే దాదాపు 2029 నాటికి సార్వత్రిక ఎన్నికలు వచ్చేసరికి కచ్చితంగా జిల్లాల విభజన అంశం మళ్లీ మరుగున పడిపోతుందని కొందరు భావిస్తున్నారు. దీనిని బట్టి మరి ప్రభుత్వం ఏం చేయాలనుకుంటుందో తెలియాల్సి ఉంది. మంత్రివర్గ ఉప సంఘం ఏ విధంగా స్పందించాలి అనేది చూడాలి. ఏది ఏమైనప్పటికీ ఇప్పటికైతే దీనిపై ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నటువంటి పరిస్థితి కనిపించడం లేదన్నది వాస్తవం. మంత్రులుగాని మంత్రివర్గ ఉపసంఘం కానీ దీనిపై మౌనంగా ఉన్నారు. మరోవైపు వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించలేక అధికారులు కూడా చేతులు ఎత్తేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇదిలా ఉండగా మంత్రివర్గ ఉప సంఘం ఎప్పుడు ఎలాంటి వివరాలు అడుగుతుందో ఆ వివరాలను తక్షణమే అందజేయడానికి సంబంధిత అధికారులు మాత్రం ప్రాథమికంగా సిద్ధపడి ఉన్నారు. ఈనెల 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయి. ఈ లోగా దీనిపై మంత్రివర్గ ఉప సంఘం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసే అవకాశం కూడా లేకపోలేదు. గడువు సమీపిస్తున్నందున ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# యోగ శిబిరం ముగింపు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పెదవడ్లపూడి యూపీ స్కూల్ లో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నాలుగు వారాలు పాటు జరిగిన 11వ ఉచిత మహిళ యోగ శిక్షణ శిబిరం ముగింపు ఆనంద మహోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ శాశ్వత సభ్యులు అన్నే చంద్రశేఖర్, యోగ సేవా కేంద్రం ఉప ప్రధాన యోగాచార్యులు శ్రీ యధాశక్తి యోగి గురూజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళ యోగ సాధకులు యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. యోగ సాధకులు నాలుగు వారాలపాటు జరిగిన శిక్షణలో పొందిన అనుభవాలను వెల్లడించారు. అనంతరం ముఖ్య అతిథి చంద్రశేఖర్ మాట్లాడారు. యోగ సాధన వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక రుగ్మతలు కూడా తొలగిపోతాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు యోగ సాధనలో శిక్షణ ఇప్పించడానికి ఆసక్తి కనబరచాలన్నారు. యోగ సేవ కేంద్రం ఉప ప్రధాన యోగాచార్యులు శ్రీ యధాశక్తి యోగి గురూజీ మాట్లాడుతూ మహిళలు యోగ శిక్షణ పొందుతే కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతిరోజు యోగ సాధన చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు యోగ సాధన చేయడానికి ముందుకు రావాలన్నారు. యోగ సాధనవల్ల మానసిక ఆనందం, ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగ సేవ కేంద్రం ప్రతినిధి కీర్తి యోగి మాతాజీ, యోగ సాధకులు అన్నే పద్మలత, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో భూముల రీ సర్వే



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగ "ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు" లో. భాగముగా గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, మోతడక గ్రామాలలో జరుగుచున్న రీ సర్వే పనుల గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బుధవారం పరిశీలించారు, రైతులతో మాట్లాడి సర్వే జరిగే ప్రక్రియ సజావుగా సాగుతున్నాయా లేవా అని తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే , భూమీ రికార్డులు గుంటూరు , ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే తాడికొండ తహశీల్దార్ తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేనకు అర్చకుల ధన్యవాదాలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) :** తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అర్చకులలో అర్హులైన ప్రతి లబ్ధిదారునికి అందే విధంగా కృషి చేయాలని శాసనమండలిలో జనసేన గొంతుకగా ఎమ్మెల్సీ కె.నాగబాబు మాట్లాడినందుకుగానూ అర్చకుల తరపున ధార్మిక పరివార్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ధార్మిక పరివార్ వ్యవస్థాపకులు బాల శ్రీనివాసులు, జాతీయ అధ్యక్షులు వి.వి.రామారావు, ప్రధాన కార్యదర్శి అక్కిరాజు గోపాలరావు, ఉపాధ్యక్షులు బులుసు రఘునాథ్ శాసనమండలి సభ్యులు కె. నాగబాబు ని కలిసి తమ సంతోషాన్ని తెలియజేశారు. "రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్చకుల సంక్షేమం కొరకు ఇస్తున్న ధూప, దీప నైవేద్య పథకం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచడం శుభ పరిణామమని, దీనిలో గౌరవ వేతనంగా రూ. 7 వేలు, 'పడితరం' రూ. 3 వేలు ప్రతి అర్చకుడుకి ఇస్తున్నారని, ఈ పథకాన్ని రూ. 10 వేలు ఆదాయంగా పరిగణించడం కారణంగా అర్చకులు తల్లికి వందనం పథకం పొందలేకపోతున్నారని, రాష్ట్రవ్యాప్త సమస్యగా గుర్తించి అర్చకుల పిల్లలకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని ఇటీవల జరిగిన శాసన మండలి సమావేశంలో ఎమ్మెల్సీ కె. నాగబాబు కోరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి "ధార్మిక పరివార్" సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

# 10, 11 తేదీల్లో జీఎస్టీ ఎగ్జిబిషన్ కం సేల్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) :** సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ లో భాగంగా 10, 11 తేదీల్లో జీఎస్టీ ఎగ్జిబిషన్ కం సేల్ ను ఏర్పాటు చేశామని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ ఇ.శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎగ్జిబిషన్ ను శుక్రవారం, శనివారం రెండు రోజులు గుంటూరు ఏ.సి కాలేజీ అసెంబ్లీ హాల్ లో ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజులు ఉదయం 10 నుండి సాయంత్రం 7 గంటల వరకు ఉంటుందని చెప్పారు. తగ్గిన జీఎస్టీ రేట్లను అనుసరించి ఎగ్జిబిషన్ కం సేల్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్లో చిన్న పిల్లలు చదువు కొనుటకు పుస్తకాలు, నోట్ బుక్స్, గ్రాఫ్ లు, పెన్సిల్స్, రబ్బర్లు, పెన్స్, గృహ ఉపకరణాలు, టీవీలు, ఏసీలు, ఫ్రిజ్ లు, సెల్ ఫోన్స్, స్కూటర్స్, మోటార్ సైకిల్స్, కార్లు, ఇతర వాహనాలు తగ్గించిన రేట్లతో పాటు దీపావళి ఆఫర్లతో అతి తక్కువ ధరలకు విక్రయించడం జరుగుతుందని అన్నారు. ప్రజలు అందరూ ఈ ఎగ్జిబిషన్లో పాల్గొని సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# పాడి రైతులకు 75% రాయితీతో కొత్త పథకం

- **ఈనెల 15 వరకు సర్వే నిర్వహించనున్న ప్రభుత్వం**
- **రాయితీ పొందాలంటే రూ. 115 చెల్లించాలి**
- **పాడి రైతుల ఆర్థిక పరిపుష్టికి దోహదం**
- **పశుగ్రాస విత్తనాలు,దాణాపై రాయితీ**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) :** పాడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త రాయితీ పథకాన్ని ఈ పథకం ద్వారా రైతులకుఏకంగా 75శాతం రాయితీని కల్పించబోతోంది., దీనికి రూ.115 కడితే చాలు అని ప్రభుత్వం ప్రకటించింది. ఇది మంచి అవకాశం అని రైతులు భావిస్తున్నారు. పశువుల ఆరోగ్యానికి టీకాలు, మందులు ఉచితంగా వేయడమే కాకుండా, పశుగ్రాసం కోసం విత్తనాలు, దాణాపై భారీ రాయితీలు అందిస్తోంది. ఈ రాయితీలతో రైతులు తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ఈ పథకం ద్వారా పాడి రైతులు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతారు .వెంటనే గ్రామీణ ప్రాంతాలలోని రైతులు సమీపంలో ఉన్న.రైతు సేవా కేంద్రాల నుంచి ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలిచింది. పశువులకు వ్యాధులు రాకుండా టీకాలు.. నట్టల నివారణ మందులు ఇస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు కూడా చేస్తున్నారు.. అలాగే మినీ గోకులం షెడ్లను 100% రాయితీతో మంజూరు చేశారు. అలాగే పశు గ్రాసం పెంచడానికి రైతులకు రాయితీపై విత్తనాలు ఇస్తున్నారు.. రాయితీపై సమీకృత దాణా కూడా అందిస్తున్నారు. ప్రభుత్వం పశుగ్రాసానికి సంబంధించి గడ్డి విత్తనా లను రాయితీపై అందిస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీ గా ఎన్ని విత్తనాలు అవసరమో గుర్తించి అందజేస్తున్నారు.

ఏపీ ప్రభుత్వం హైబ్రీడ్ జొన్న, మొక్కజొన్న రకాల విత్తనాలను అందజేస్తున్నారు..ఏకంగా 75 శాతం రాయితీతో పంపిణీ చేస్తున్నారు. పశుగ్రాసానికి అవసరమైన జొన్న రకాలు 5 కిలోల ప్యాకెట్ ధర రూ.460.. రైతు తన వాటాగా రూ.115 చెల్లిస్తే మిగిలింది ప్రభుత్వం నుంచి రాయితీ. ఇలా విత్తనాలను ఒక్కో రైతుకు 5 నుంచి 20 కేజీల వరకు అందిస్తు న్నారు. మొక్కజొన్న విషయానికి వస్తే.. ఈ విత్తనాలను 5 కేజీల ప్యాకెట్ ధ రూ.340.. రాయితీ తర్వాత రూ.85 చెల్లిస్తే సరిపోతుంది. అంతేకాదు ప్రభుత్వం సమీకృత దాణాపై కూడా 50శాతం రాయితీ ఇస్తోంది. ఈ మేరకు జిల్లాల వారీగా దాణాను కేటాయించారు. దాణా 50 కిలోల బస్తా ధర రూ.1,110 కాగా.. రాయితీ కింద రూ.555 పోను.. మిగిలిన రూ.555 రైతు చెల్లిస్తే సరిపోతుంది. ఈ దాణాను ప్రభుత్వం ఒక్కో రైతుకు క్వింటా నుంచి 1.50 క్వింటాళ్ల వరకు అందజేస్తున్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పాడి రైతుల అవసరాలు తెలుసుకునే పనిలో ఉంది. దీని కోసం సర్వే చేపట్టింది.. రుణాలు, బీమా వంటి అంశాలపై సర్వే చేస్తోంది. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదిస్తే వివరాలు చెబుతారు.. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు కాపీలు తీసుకెళ్లాలి. అంతేకాదు ఏపీ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 వరకు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఏహెచ్ఏలు, పారా సిబ్బంది సర్వే చేస్తున్నారు. మొత్తం మీద ఏపీ ప్రభుత్వం పాడి రైతులకు రాయితీపై పశు గ్రాసానికి అవసరమైన విత్తనాలతో పాటుగా దాణాను అందజేస్తోంది.

# రైతులను మభ్యపెట్టి ఎన్నాళ్ళు ఇలాంటి రాజకీయాలు చేస్తారు రఘురాంరెడ్డి గారు..?!



**మైదుకూరు:** (కడప జిల్లా)జర్నలిస్ట్ ఫైల్ అక్టోబర్ 8:అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బంది పడుతుంటే వాళ్ళ దగ్గరికి వెళ్లి పరామర్శించాల్సింది పోయి రైతులు పంటలు పండక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మాట్లాడడం చూస్తుంటే,రైతులను ఆత్మహత్యలకు పాల్పడే విధంగా ఉసిగొల్పడం న్యాయమా మాజీ ఎమ్మెల్యే రఘురాంరెడ్డి గారు అంటూ మైదుకూరు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఏపీ రవీంద్ర విమర్శలు గుప్పించారు.బుధవారం అయినా తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రశాంతంగా వ్యవసాయం చేసుకొనే రైతులను,మీరు వస్తే ధర్నాలు చేస్తాం,మీరు వస్తే కలెక్టర్ ఆఫీస్ ముట్టడి చేస్తాము అంటూ వారిని మీ రాజకీయ స్వలాభం కోసం బలి పశువులు చేస్తున్నారా అని ఆయన ఎద్దేవాచేశారు.గత ప్రభుత్వం హయాంలో ఆదిరెడ్డి పల్లె రెవెన్యూ పరిధిలో కేవలం 600 ఎకరాలు మాత్రమే పంట నమోదు కార్యక్రమం జరిగిందని,కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే సుమారు 1000 ఎకరాల పంట నమోదు కార్యక్రమం అధికారులు చేపట్టడం జరిగిందన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని ఆనాడు చంద్రబాబు నాయుడు తీసుకొచ్చారని ఆ విషయం మీరు మరిచిపోయినట్టున్నారు కానీ ప్రజలు రైతులు మర్చిపోలేదని విమర్శించారు.యూరియా వద్దు సేంద్రీయ వ్యవసాయం ముద్దు అని ఎందుకు అంటున్నారు అంటే,సేంద్రీయ వ్యవసాయంతో పంటలు పండిస్తే తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడి మరియు ఆరోగ్యకారణమైన పంట ప్రజలకు అందించవచ్చు అనే ఉద్దేశంతోనే చెప్పామన్నారు.యూరియా,పురుగుమందులు వాడితే భూమిలో భూసార%శీ% తగ్గిపోయి పంటలు సరిగా పండవు కనుక తద్వారా ప్రజల ఆరోగ్యం నాశనం అవుతుందనే ఉద్దేశంతోనే యూరియాలు,కెమికల్ మందులు వాడద్దని రాష్ట్ర ప్రభుత్వం మరియు శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి పాలన వచ్చిన తర్వాత ఒకవైపు అభివృద్ధి ఒకవైపు సంక్షేమంతో రాష్ట్రం సుభిక్ష పాలనతో ముందుకెళ్తోందని ఆయన కొనియాడారు.రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులకు హెక్టారుకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ప్రకటించిందని,ఆ సంగతి మీరు మరిచారా..అని అన్నారు.ఒకవైపు అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతుంటే,వారిని ఓదార్చాల్సింది పోయి పుండు మీద కారం చల్లినట్టు మాజీ ఎమ్మెల్యే గారు మాట్లాడట%శీ% ఇది ఎంత వరకు న్యాయం రఘురాంరెడ్డి గారు అంటూ ఆయన విమర్శలు గుప్పించారు.మీరు సీనియర్ నాయకులని భావించి మైదుకూరు నియోజవర్గ అభివృద్ధికి సహకరించండి అని,మా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బహిరంగ ప్రకటన చేశారని,అది మా ఎమ్మెల్యే మంచితనానికి నిదర్శనమన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పాలన చేస్తుందని,

బటన్ నొక్కే ప్రభుత్వం మాత్రం కాదని,కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్ని ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకెళ్తుందని తెలిపారు.మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు మైదుకూరు మండలంలో ఇప్పటివరకు 8,800 ఎకరాలకు పంట నమోదు కార్యక్రమాన్ని అధికారులు పూర్తి చేయడం జరిగిందన్నారు.రైతు సోదరులు ప్రభుత్వం నుండి రాయితీలు పొందాలంటే పంట నమోదు చేసుకొని వారు ఈనెల 25 లోపల చేయించుకోవాలని ఆయన సూచించారు.ప్రభుత్వం నుంచి రైతు సోదరులకు ఎలాంటి సాయం అందాలన్న పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆయన రైతులను కోరారు.

# దేశీయ వైద్య సంఘం ఏర్పాటు అభినందనీయం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్ర ప్రభుత్వం దేశీయ వైద్య సంఘం ద్వారా ఆయుర్వేద దేశీయ సాంప్రదాయాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు ప్రత్యేకంగా సంఘాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ పాండురంగ విఠలేశ్వర్ పేర్కొన్నారు.

స్థానికరామలింగేశ్వరపేటలోని ధన్వంతరి వైద్యశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి ప్రాంతీయ కన్వీనర్ డాక్టర్ జూటూరు సత్యనారాయణ

మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాండురంగ విఠలేశ్వర్ మాట్లాడుతూ ఆయుర్వేద దేశీయ సాంప్రదాయ అనువంశిక వైద్యుల నైపుణ్యత చిరునామా నమోదు కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యంలో ప్రవేశం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశీయ సాంప్రదాయ వైద్యాన్ని వంశపారంపర్యంగా కొనసాగిస్తున్న గ్రామీణ ప్రాంతంలోని వైద్యులు వినియోగించు

కోవాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఆయుర్వేద వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంసంతోషదాయకమన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ఆయుర్వేద వైద్యాన్ని ఆయుష్ శాఖ ద్వారా అభివృద్ధి పరచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టారని, దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశీయ వైద్య సంఘం వారికి ఔషధ మొక్కల పెంపకం నిమిత్తం


గా భూమిని కేటాయించిన రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ కు మెడిసినల్ ప్లాంట్ బోర్డు వారికి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెనాలి ప్రాంతంలో దేశీయ సాంప్రదాయ వైద్యంపై అనుభవం కలిగిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారని, తద్వారా ప్రజలకు తమ సేవలను మరింత చేరువ చేసేందుకు సంఘం కృషి చేస్తుందన్నారు. అనుభవం కలిగిన ప్రతి ఒక్కరూ సభ్యులుగా చేరాలన్నా. సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వ గుర్తింపు పొందిన సంఘం ద్వారా ఆయుర్వేద వైద్యాన్ని ప్రజలకు అందించేందుకు సర్టిఫికెట్లు కూడా మంజూరు చేయబడతాయి అన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామీణ వైద్యులు సంఘ సభ్యత్వాలను పొందారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ హనుమంతరావు కార్యదర్శి కొలిపాక అంజిబాబు ప్రభాకర్ రెడ్డి టీ శ్రీనివాసరావు డాక్టర్ విష్ణు రాధాకృష్ణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** అట్టడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలోని కూటమి నాయకత్వం పనిచేస్తుందని తెనాలి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కోగంటి రోహిత్ ఆటోడ్రైవర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేర్కొన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఆటోడ్రైవర్లలో నెలకొన్న అభద్రతా భావాన్ని పోగొడుతు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కూటమి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో నేరుగా 15 వేల రూపాయలు జమ కావడం పట్ల, చినరావూరు రైల్వే స్టేషన్ సెంటర్లోని, ఆటో డ్రైవర్ల సంఘం తమ హర్షం వెలిబుచ్చుతు, బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కోగంటి రోహిత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదుల చిత్రపటాలకు పాల అభిషేకం చేశారు. రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్, పద్మశాలియ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో కోగంటి రోహిత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందరి ప్రయోజనాలకు తగు ప్రాధాన్యం కల్పిస్తూ, సంక్షేమంతో పాటు, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నదని, బలమైన నాయకత్వంలోనె రాష్ట్ర ప్రజలకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ టియుసి తెనాలి పట్టణ అధ్యక్షులు అన్నం పిన్నారావు, రాములు నాయక్, కొర్ర లక్ష్మణ్, శ్రీనివాస్ నాయక్, అమర్ సింగ్, రామ్ చంద్ రాంచంద్, కె. లక్ష్మణరావు,హరి నాయక్, బాలకృష్ణ నాయక్, కృష్ణ, శేషు, రాజేష్, నానిక్య, సీతా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాకపోకలకు జీటీ రోడ్ కీలకం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు మార్కెట్ సెంటర్ నుండి చుట్టుగుంట సెంటర్ వరకు ఉన్న జీటీ రోడ్ నిర్మాణ పనులకు త్వరితగతిన ప్రారంభించేలా చొరవ తీసుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి, కలెక్టర్ శ్రీమతి తమిమా అన్సారీయాని కోరారు. బుధవారం కలెక్టర్ తమిమా అన్సారీయాను మర్యాదపూర్వకంగా కలిసి గుంటూరు నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ."జీటీ రోడ్ గుంటూరు నగర రాకపోకలకు ప్రధాన రహదారి, అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ రహదారి తీవ్రంగా దెబ్బతిన్నది. వాహనదారులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# మహంకాళి అమ్మ దేవాలయం సమీపంలో.చెత్త తొలగింపు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** చిలువూరు – కంఠంరాజు కొండూరు గ్రామాల మధ్య మహంకాళి అమ్మవారు దేవాలయం సమీపంలో చెత్తను తొలగించడం జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి

బి.వి. నాగ సాయి కుమార్ తెలిపారు. "డంపింగ్ యార్డులా చిలువూరు – కె.ఆర్.కొండూరు రోడ్డు" శీర్షికన ఒక దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన వార్తపై వెంటనే స్పందించి చిలువూరు మరియు కంఠంరాజు కొండూరు గ్రామ పంచాయతీల సిబ్బంది మంగళవారమే చెత్త తొలగించారని వివరించారు. చిలువూరు మరియు కంఠంరాజు కొండూరు గ్రామాల రహదారిలో శ్రీ మహంకాళి అమ్మవారు దేవాలయం ఉందని, దేవాలయానికి ముఖ్యంగా ఆదివారం రోజున ఎక్కువ మంది భక్తులు రావడం జరుగుతుందన్నారు.

భక్తులు మొక్కులు సమర్పించుకుని

గుడి ప్రాంగణం, చుట్టుపక్కల గల తోటలలో విందు భోజనములు చేయడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఎక్కువ మొత్తంలో చెత్త వస్తుందన్నారు. చిలువూరు మరియు కంఠంరాజు కొండూరు గ్రామ పంచాయతీ

సిబ్బంది శుభ్రపరచుట జరుగుతోందని, గత వారం తరచుగా వర్షాలు కురిసిన

కారణంగా చెత్తను తొలగించుటలో కొంత జాప్యం జరిగినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చినట్లు చెప్పారు.

# విద్యార్థులకు మానసిక ఆరోగ్యం శ్రద్ధ చూపాలి:ఎన్ ప్యారీ జాన్



**బాపట్ల జిల్లా, (జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థుల కు మానసిక ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ఎన్ ప్యారి జాన్ తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా వి పి హెచ్ ఎస్ ఇడుపులపాడు హై స్కూల్ నందు విద్యార్దులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్యారి జాన్ మాట్లాడుతూ విద్యార్దులకు స్వీయ పరిశీలన వంటి పలు అంశాలు గూర్చి అవగాహన కల్పించారు. విద్యార్దులు తమ ఆలోచనలు, భావాలు, ప్రవర్తనను విశ్లేషించుకోవడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధించగలరని తెలిపారు. జీవితంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి దోహదపడుతుందన్నారు.క్రమం తప్పకుండా ప్రతి రోజూ 8-8-8 ఫార్ములా(8 గంటలు నిద్ర,8 గంటలు చదువు/పని,8 గంటల విశ్రాంతి మరియు కుటుంబం తో గడపడం) గురించి తెలియజేశారు. సమతుల జీవన శైలిని అనుసరించడం ద్వారా మానసిక ఆరోగ్యం కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల హెచ్ ఎం పెరి రెడ్డి, ఎస్ ఎం సి చైర్మన్ భూపతి, తదితరులు పాల్గొన్నారు.

# భారత్ గౌరవ్ పర్యాటక ప్రత్యేక రైలు



## తెలుగు రాష్ట్రాల మీదుగా గుజరాత్‌కు రాకపోకలు

**గుంతకల్లు రైల్వే, అక్టోబరు 8(జర్నలిస్ట్‌ఫైల్):** తీర్థయాత్రలలో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించాలనుకునే ఔత్సాహిక యాత్రికుల సౌకర్యార్థం రైల్వేశాఖ సీమాంధ్ర మీదుగా గుజరాత్ కు భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 26న మధ్యాహ్నం 03:00 గంటలకు రేణిగుంట నుండి బయలు దేరే 'భారత్ గౌరవ్' ప్రత్యేక పర్యాటక రైలు భవ్య గుజరాత్ ప్యాకేజ్ (9 రాత్రులు / 10 రోజులు) కోసం బయలు దేరుతుంది. ఈ రైలు ఈనెల 27న, సికింద్రాబాద్ కు ఉదయం 08:00 గంటలకు, నిజామాబాద్, నాందేడ్, పూర్ణాల మీదుగా ద్వారకలోని ద్వారకాధీశ్ ఆలయం, నాగేశ్వర ఆలయం, బేట్‌ద్వారకా, సోమనాథ్‌లోని సోమనాథ్ ఆలయం, అహ్మదా బాద్‌లోని సబర్మతి ఆశ్రమం, మోడేరా లోని సూర్యదేవాలయం (మోడేరా), రాణి కి వావ్ (పటాన్), ఎకతా నగర్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీలను యాత్రికులకు చూపుతుంది.

**ప్రయాణ మార్గం:** రేణిగుంట నుండి బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట్, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్, పూర్ణా మీదుగా ప్రయాణిస్తుంది.

**ప్యాకేజ్ ధరలు:** ఎకానమీ క్లాస్ (స్లీపర్) రూ.18, 400, స్టాండర్డ్ (3ఏసి) 30,200 వేలు, కంఫర్ట్ (2ఏసి) 39,900 వేల రూపాయలు.

**సౌకర్యాలు:** రోజుకు మూడు భోజనాలు, వసతి, రవాణా సదుపాయం, ప్రతి బోగీలో కూడా ఐఆర్‌సిటి సిసిబ్బంది అందుబాటులో ఉంటారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు తెలిపారు.

**తిరుపతి-అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు**

ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేశాఖ తిరుపతి-అనకాపల్లితిరుపతి మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి అనకాపల్లి వెళ్లే నెంబర్ 07481 ప్రత్యేక రైలు నవంబరు 02 నుంచి 30 వరకు ప్రతి ఆదివారం రాత్రి 0800 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 09 30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అనకాపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబరు 07482 ఎక్స్ ప్రెస్ ఈనెల 03 నుంచి డిసెంబర్ 01 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 0535 గంటలకు అనకాపల్లి నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 0740 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.



జాన్ క్లార్క్



మైఖేల్ హెచ్. డివోరెట్



జాన్ ఎం. మార్టినిస్

# ఫిజిక్స్‌లో ముగ్గురికి నోబెల్

## క్వాంటం టన్నెలింగ్, ఎనర్జీ క్వాంటైజేషన్‌పై పరిశోధన

**స్టాక్‌హోమ్, అక్టోబరు 8:** భౌతికశాస్త్ర విభాగంలో నోబెల్ బహుమతి 2025ని ప్రకటించారు. ఈ అత్యంత ప్రతిష్ఠాత్మక అవార్డును ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. జాన్ క్లార్క్, మైఖేల్ హెచ్. డివోరెట్, జాన్ ఎం. మార్టినిస్‌లను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ప్రకటించింది. అణువుల స్థాయిలో మాత్రమే సాధ్యమనుకున్న క్వాంటం భౌతికశాస్త్ర సూత్రాలను, కంటికి కనిపించేంత పెద్ద ఎలక్ట్రిక్ సర్క్యూట్‌లో విజయవంతంగా ప్రదర్శించినందుకుగాను వారికి ఈ గౌరవం దక్కింది. క్వాంటం మెకానిక్స్ ప్రకారం, ఒక కణం తనకు అడ్డుగా ఉన్న గోడను సైతం దాటుకుని వెళ్లగలదు. దీనినే టన్నెలింగ్ అంటారు. అయితే ఇలాంటి వింత ప్రవర్తనలు కేవలం సూక్ష్మ ప్రపంచానికే పరిమితమని ఇప్పటివరకు భావించేవారు. కానీ, ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు 1984-85 మధ్యలో చేసిన ప్రయోగాలతో ఈ అభిప్రాయాన్ని మార్చేశారు. వారు సూపర్ కండక్టర్లతో, మధ్యలో ఒక విద్యుత్ నిరోధక పొర (జోసెఫ్ సన్ జంక్షన్) ఉండేలా ఒక ప్రత్యేకమైన ఎలక్ట్రిక్ సర్క్యూట్‌ను రూపొందించారు. ఈ సర్క్యూట్‌లో విద్యుత్‌ను ప్రవహింపజేసినప్పుడు, అందులోని కణాలన్నీ కలిసి ఒకే స్థూల కణంగా ప్రవర్తించడాన్ని వారు గమనించారు. ఈ స్థూల కణం, ఎలాంటి అడ్డంకి లేకపోయినా క్వాంటం టన్నెలింగ్ ద్వారా సున్నా వోల్టేజ్ స్థితి నుంచి బయటపడటాన్ని వారు నిరూపించారు. అలాగే, ఈ వ్యవస్థ నిర్దిష్ట పరిమాణంలో మాత్రమే శక్తిని గ్రహించడం లేదా విడుదల చేయడాన్ని కూడా ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ ఆవిష్కరణపై నోబెల్ కమిటీ ఛైర్ ఓల్ ఎరిక్సన్ స్పందిస్తూ, "శతాబ్దాల నాటి క్వాంటం మెకానిక్స్ నిరంతరం కొత్త ఆశ్చర్యాలను అందిస్తుండటం అద్భుతంగా ఉంది. అన్ని డిజిటల్ టెక్నాలజీలకు క్వాంటం మెకానిక్సే పునాది కాబట్టి ఇది ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పరిశోధనలు క్వాంటం కంప్యూటర్లు, క్వాంటం సెన్సార్లు, క్వాంటం క్రిప్టోగ్రఫీ వంటి భవిష్యత్ టెక్నాలజీల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తాయని శాస్త్ర ప్రపంచం భావిస్తోంది.



# ప్రజాజీవితంలో పాతికేళ్లు!

## ప్రధానిమోడీ పునఃశ్చరణం

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ప్రధాని నరేంద్ర మోడీ ఇవాళ తన రాజకీయ జీవితంలో కీలక మైలురాయి అందుకున్నారు. ప్రభుత్వాధినేతగా ఆయన 25 యేళ్లు పూర్తి చేసుకున్నారు. ఓ ప్రభుత్వానికి అధినేత హోదాలో ఆయన 25 యేళ్లుగా సేవలు అందిస్తున్నారు. అక్టోబర్ 7, 2025 నాటికి తనపరిపాలన 25 ఏళ్లకు చేరుకున్నట్లు ప్రధాని మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో పేర్కొన్నారు. ఇదే రోజున 2001లో గుజరాత్ సిఎంగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. దేశ ప్రజల జీవితాలను బలోపేతం చేసేందుకు, దేశ ఉజ్వల ప్రగతి కోసం ఆనాటి నుంచి శ్రమిస్తున్నట్లు చెప్పారు. చాలా విపత్కర పరిస్థితుల్లో ఉన్న గుజరాత్‌కు తనను సిఎంగా చేశారని, ఆ బాధ్యతలను తనకు పార్టీ అప్పగించినట్లు గుర్తు చేశారు. భారీభూకంపం, సూపర్‌సైక్లోన్, వరుస కరవులతో సతమతం అవుతున్న గుజరాత్‌ను తన చేతుల్లోపెట్టారన్నారు. ఇక 2014 లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రధానిగా దేశానికి సేవ చేస్తున్నట్లు మోడీ తన ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు.

# సిజెఐపై దాడిపై నాకెలాంటి పశ్చాత్తాపంలేదు

## ఆ దేవుడే ఇలా చేయించాడు: న్యాయవాది రాకేశ్ కిశోర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసినందుకు తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని న్యాయవాది రాకేశ్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఓ విష్ణుమూర్తి విగ్రహానికి సంబంధించిన పిటిషన్‌పై సిజెఐ చేసిన వ్యంగ్య వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని, అందుకే ఈ చర్యకు పాల్పడ్డానని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. సెప్టెంబర్ 16న మధ్యప్రదేశ్‌లోని జవారీలో ఉన్న ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహం పునరుద్ధరణపై సిజెఐ ముందు పిటిషన్ విచారణకు వచ్చిందని రాకేశ్ కిశోర్ గుర్తుచేశారు. ఆ సమయంలో "వెళ్లి మీ దేవుడినే ఏదైనా చేయమని అడగండి" అంటూ సిజెఐ వ్యాఖ్యానించడం తనను కలచివేసిందన్నారు. "న్యాయం చేయకపోయినా పర్వాలేదు కానీ, నమ్మకాలను ఎగతాళి చేయకూడదు. పిటిషన్‌ను తిరస్కరించడం అన్యాయం" అని ఆయన పేర్కొన్నారు. తాను హింసకు వ్యతిరేకినని, అయితే ఒక సాధారణ పౌరుడు ఎందుకిలా చేశాడో ఆలోచించాలని అన్నారు. "నేను ఏ మత్తులోనూ లేను. ఆయన చర్యకు ఇది నా ప్రతిస్పందన మాత్రమే. నాకు భయంలేదు, పశ్చాత్తాపం లేదు. క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు. ఈ పని దేవుడే చేయించాడు. నన్ను జైలుకు పంపినా, ఉరితీసినా అది ఆయన చిత్తమే'నని రాకేశ్ కిశోర్ వ్యాఖ్యానించారు. సనాతన ధర్మం, గుర్తింపు ప్రమాదంలో ఉన్నాయని, ప్రజలు తమ హక్కుల కోసం ముందుకు రావాలని ఆయన పిలుపు నిచ్చారు. తనను బార్ కౌన్సిల్ సస్పెండ్ చేయడంపైనా రాకేశ్ కిశోర్ స్పందించారు. న్యాయవాదుల చట్టంలోని సెక్షన్ 35 ప్రకారం, క్రమశిక్షణా కమిటీని ఏర్పాటు చేసి, నోటీసు ఇచ్చి, తన వాదన విన్న తర్వాతే చర్యలు తీసుకోవాలని, కానీ బార్ కౌన్సిల్ ఆ నిబంధనలను ఉల్లంఘించిందని ఆయన ఆరోపించారు. ఇక, సిజెఐపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మంగళవారం సుప్రీంకోర్టు ఎదుట నిరసన తెలిపింది. ఇది న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించింది. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

# 4 రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

## మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లలో 18 జిల్లాల అనుసంధానం

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ఐదురాష్ట్రాలపరిధిలోని 18 జిల్లాలను కలుపుతూ నాలుగు ప్రాజెక్టుల రైల్వే నెట్‌వర్క్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ సమావేశంలో ఈ నాలుగు ప్రాజెక్టులకు సుమారు రూ.24, 634 కోట్ల వ్యయం కాగలదని అంచనావేసారు. వాటిలో మహారాష్ట్రలోని వార్ధా భూసావాల్‌ల మధ్య ఉన్న మూడు, నాలుగో లైన్లు 314 కిలోమీటర్లు, మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌పరిధిలోని గోండియా, డోంగర్‌గఢ్ నాలుగోలైన్ 84 కిలోమీటర్లు, గుజరాత్, మధ్యప్రదేశ్ పరిధిలోని 259 కిలోమీటర్ల నిడివికలిగిన వడోదర, రత్లాం మూడు నాలుగు లైన్లను అభివృద్ధి చేస్తారు. ఇటార్సీ, భోపాల్, బీనాలమధ్య నాలుగోలైన్ 237 కిలోమీటర్ల నిడివికలిగింది కూడా ఈ రైల్వే నెట్‌వర్క్ పరిధిలోఉంది. ఈ మల్టీట్రాకింగ్ ప్రాజెక్టు వల్ల సుమారు 85.84 లక్షల జనాభా ఉన్న 3633 గ్రామాలకు, రెండు ప్రధాన స్ఫూర్తిదాయక జిల్లాలు విదిషా, రాజ్‌నంద్‌గావ్‌లకు రవాణాసదుపాయం మరింతగా మెరుగుపడుతుందని కేబినెట్ అనంతరం సమాచార మంత్రి అశ్వినివైష్ణవ్ వెల్లడించారు. అంతే కాకుండా 18 జిల్లాల పరిధిలో సమగ్రాభివృద్ధితో పాటు స్వయం ఉపాధికూడా పెరుగుతుందని, ప్రజల్లో ఆత్మనిర్భరతను మరింత పెంచాలన్న ప్రధానిమోడీ లక్ష్యానికి అనుగుణంగా ఈప్రాజెక్టులు రూపుదిద్దుకుంటాయని తెలిపారు.

# నాభార్య రాత్రిళ్లు నాగినిగా మారిపోతోంది!

## రక్షించాలంటూ ప్రజావాణిలో ఫిర్యాదు



**లక్నో, అక్టోబరు 8:** ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులు సాధారణంగా కరెంటు, నీళ్లు, రోడ్లు, రేషన్ కార్డుల వంటి సమస్యలపై ఉంటాయి. కానీ, ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లాలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదు విని అధికారులు నివ్వెరపోయారు. తన భార్య రాత్రిపూట పాముగా మారి తనను కాటు వేయడానికి ప్రయత్నిస్తోందని ఓ భర్త చేసిన ఆరోపణ ఇప్పుడు సంచలనంగా మారింది. మహమూదాబాద్ పరిధిలోని లోధ్సా గ్రామానికి చెందిన మెరాజ్ అనే వ్యక్తి సమాధాన్ దివస్ (ప్రజావాణి) కార్యక్రమంలో భాగంగా జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిశాడు. "అయ్యా, నా భార్య నసీమున్ రాత్రి అయితే చాలు పాములా మారిపోతోంది. నన్ను కాటు వేయడానికి వెంట పడుతోందని ఫిర్యాదు చేశాడు. తన భార్య వల్ల తనకు ప్రాణహాని ఉందని, ఆమె తనను మానసికంగా తీవ్రంగా హింసిస్తోందని వాపోయాడు. ఇప్పటికే చాలాసార్లు తనను చంపడానికి ప్రయత్నించిందని, అయితే ప్రతీసారి తాను మెలకువతో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డానని మెరాజ్ తెలిపాడు. నిద్రలో ఉన్నప్పుడు ఏదో ఒక రాత్రి తనను చంపేయగలదని భయం వ్యక్తం చేశాడు. ఈ మేరకు జిల్లా మేజిస్ట్రేట్‌కు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు సమర్పించాడు. ఈ వింత ఫిర్యాదుతో ఆశ్చర్యపోయిన జిల్లా కలెక్టర్, వెంటనే దీనిపై విచారణ చేపట్టాలని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్డీఎం), పోలీసులను ఆదేశించారు. పోలీసులు దీన్ని మానసిక వేధింపుల కోణంలో దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఈ విషయం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో వేగంగా వైరల్ అయింది. నెటిజన్లు దీనిపై సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఆమె ఇంకెంత మందిని కరుస్తోందో ఏమో అని ఒకరు వ్యాఖ్యానించగా, ఏమైనా నాగమణి దాచిపెట్టావా? అని మరొకరు చమత్కరించారు. నీ పెళ్లి జీవితంలో శ్రీదేవి దొరికింది, చాలా అదృష్టవంతుడివి అంటూ 1986 నాటి నాగిన్ సినిమాలో నటి శ్రీదేవి పోషించిన ఇచ్ఛాధారి పాము పాత్రను గుర్తుచేస్తూ మరో నెటిజన్ కామెంట్ చేశారు. ఈ విచిత్రమైన కేసులో అసలు నిజం ఏంటో తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# యేడాది తర్వాత కేజ్రీవాల్‌కు అధికారిక నివాసం కేటాయింపు

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఎట్టకేలకు అధికారిక బంగ్లా లభించింది. సిఎం అధికారిక నివాసాన్ని విడిచిపెట్టిన దాదాపు ఏడాది తర్వాత ఆయనకు కేంద్రం అధికారిక బంగ్లాను కేటాయించింది. 95, లోధి ఎస్టేట్‌లోని టైప్ 7 బంగ్లాను కేటాయించింది. అయితే, బీఎస్పీ అధినేత్రి మాయావతి గతంలో నివసించిన లోధి ఎస్టేట్‌లోని బంగ్లాను కేజ్రీవాల్‌కు కేటాయించాలని ఆప్ కోరింది. కానీ ఆ బంగ్లాను జూన్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి కేటాయించడంతో.. కేజ్రీకి వేరే బంగ్లా అలాట్ చేశారు. 2024 అక్టోబర్‌లో ఢిల్లీ సిఎం పదవి నుంచి వైదొలిగిన అరవింద్ కేజ్రీవాల్, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని అధికార నివాసాన్ని ఖాళీ చేశారు. నాటి నుంచి మండి హౌస్ సమీపంలోని మరో పార్టీ సభ్యుడి అధికారిక గృహంలో ఆయన నివసిస్తున్నారు. ఈ క్రమంలో తనకు అధికారిక బంగ్లా కేటాయించాలంటూ కేజ్రివాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా పదిరోజుల్లోగా ప్రభుత్వనివాసం కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి

## ఏడుగురికి తీవ్ర గాయాలు

**న్యూఢిల్లీ, అక్టోబరు 8:** పాకిస్థాన్‌లో ప్రయాణికుల రైలుపై మరోసారి దాడి జరిగింది. క్వెట్టా వెళుతున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దుండగులు జరిపిన పేలుడులో కనీసం ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. సింధ్ ప్రావిన్స్‌లోని షికార్‌పూర్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ రైలుపై దాడులు జరగడం ఇదే మొదటిసారి కాదు. షికార్‌పూర్ జిల్లాలోని సుల్తాన్ కోట్ రైల్వే స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో ఉదయం 8:15 గంటల సమయంలో రైల్వే ట్రాక్‌పై దుండగులు అమర్చిన బాంబు పేలింది. జాఫర్ ఎక్స్‌ప్రెస్ ఆ మార్గం గుండా వెళుతున్నప్పుడు ఈపేలుడు సంభవించినట్లు షికార్‌పూర్ డిప్యూటీ కమిషనర్ షకీల్ అబ్రో ధృవీకరించారు. ఈ ఘటనలో గాయపడిన ఏడుగురిలో నలుగురిని కంబైన్డ్ మిలిటరీ ఆసుపత్రికి, మిగిలిన ముగ్గురిని షికార్‌పూర్‌లోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. పేలుడు తర్వాత ప్రయాణికులను సమీప స్టేషన్లకు తరలించి, రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు ప్రారంభించినట్లు సుక్కూర్ డివిజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి మొహసిన్ అలీ సియాల్ వివరించారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు తరచూ దాడులకు గురవుతోంది. గత నెల సెప్టెంబర్ 24న బలూచిస్థాన్‌లోని మస్తుంగ్ ప్రాంతంలో ఇదే రైలుపై జరిగిన బాంబు దాడిలో 12 మంది గాయపడ్డారు. అంతకు ముందు ఈ ఏడాది మార్చిలో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) ఉగ్రవాదులు ఇదేరైలును హైజాక్ చేసి, 400 మంది ప్రయాణికులను బందీలుగా పట్టుకోవడం తీవ్ర కలకలం సృష్టించింది.

# సింగర్ జుబీన్ బాడీగార్డ్ ఖాతాల్లో రూ. కోటి లావాదేవీలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8:** అస్సాంకు చెందిన ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ ఇటీవల సింగపూర్‌లో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ ఓ కీలకవిషయం వెలుగులోకి వచ్చింది. గాయకుడి భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో రూ.కోటి లావాదేవీలు జరిగాయి. గార్గ్ మృతిపై సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఆయనకు చెందిన ఇద్దరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది బ్యాంకు ఖాతాలను అధికారులు పరిశీలించారు. వారి ఖాతాల్లో దాదాపు రూ.కోటి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. దీంతో గార్గ్ మరణంలో వారి ప్రమేయం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారికి అంత డబ్బు ఎలా వచ్చిందనే దానిపై అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గాయకుడి మృతి కేసును ఆర్థిక కోణంలో కూడా దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని సిఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. ఇటీవల జుబీన్ బ్యాండ్‌మేట్ శేఖర్‌జ్యోతి గోస్వామి తన వాంగ్మూలంలో సంచలన ఆరోపణలు చేశారు. గాయకుడికి ఆయన మేనేజర్, ఫెస్టివల్ ఆర్గనైజేషన్ విషమిచ్చి దాన్నిప్రమాదకరంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి ఉంటారన్నారు. జుబీన్ నోరు, ముక్కు నుంచి నురగ వస్తున్నప్పుడు కూడా మేనేజర్ ఏ మాత్రం కంగారు పడలేదన్నారు. వెంటనే చికిత్స అందించకుండా ఆలస్యం చేశారని పేర్కొన్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలు


## ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్!



**న్యూయార్క్, అక్టోబరు 8:** మధ్య శ్రేణి, హెవీ డ్యూటీ ఇంపోర్టెడ్ ట్రక్కులపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. వచ్చే నెల 1 నుంచి ఇది అమల్లోకి రానుందని తెలిపారు. ఈ ట్రక్కులను అమెరికాకు అధికంగా ఎగుమతి చేసే 5 దేశాల్లో మెక్సికో, కెనడా, జపాన్, జర్మనీ, ఫిన్లాండ్ ఉన్నాయి.

## వలసలపై ట్రంప్ ఉక్కుపాదం

# యుఎస్ వెళ్లేందుకు భారతీయ విద్యార్థుల అనాసక్తత




**వాషింగ్టన్, అక్టోబర్ 8:** మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, చట్టపరమైన ప్రవేశాలపై ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. దీంతో బంగారు భవిష్యత్తును తలుచుకుంటూ ఆ దేశానికి వెళ్లాలనుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆగస్టులో ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ వెల్లడించింది. ట్రంప్ చర్యల నేపథ్యంలో ఆగస్టులో విదేశీ విద్యార్థులకు జారీచేసే వీసాల్లో తగ్గుదల కనిపించింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే అమెరికాకు వచ్చే విద్యార్థుల సంఖ్య 19 శాతం తగ్గింది. కరోనా మహమ్మారి తర్వాత ఇదే రికార్డు స్థాయి తగ్గుదల కావడం గమనార్హం. ఇక భారతీయ విద్యార్థుల విషయానికొస్తే 44 శాతం మేర క్షీణత కనిపించింది. సాధారణంగా యుఎస్ విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యే ఆగస్టులో అమెరికా 3,13,138 విద్యార్థి వీసాలు జారీ చేసింది. గత ఏడాది ఇదే సమయానికి అగ్రదేశానికి వెళ్లిన విద్యార్థుల సంఖ్యలో భారత్ ముందంజలో ఉండగా, ఈసారి ఆ సంఖ్య భారీగా తగ్గింది. మరోవైపు చైనా విద్యార్థులకు యుఎస్ 86,647 వీసాలు జారీ చేసింది. భారతీయులకు జారీ చేసిన వీసాల సంఖ్యకంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం. ఈ యేడాదిమేలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా రాయబార కార్యాలయాల్లో కొత్తగా దరఖాస్తు చేసుకునే విద్యార్థుల వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా వెట్టింగ్ కోసం వీసాల జారీని నిలిపివేశామని అప్పట్లో ఆ దేశ విదేశాంగ శాఖ వెల్లడించింది. వీసా దరఖాస్తుదారులకు అనుమతి ఇవ్వొచ్చా లేదా అనే దాన్ని అంచనావేయడం కోసం వారి ఆన్‌లైన్ యాక్టివిటీని అధికారులు తనిఖీ చేయనున్నారు. దీన్నే సోషల్ మీడియా వెట్టింగ్ అంటారు. సంబంధిత విద్యార్థుల సోషల్ మీడియా ప్రొఫైళ్లను పరిశీలించిన తర్వాతే వీసా మంజూరు చేస్తారు. అయితే తర్వాత వీసా ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ట్రంప్ హెచ్1బి వీసా దరఖాస్తు రుసుమును భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అమెరికా వెళ్లే భారతీయ విద్యార్థులపై ప్రభావం చూపిస్తున్నాయి.

# సంక్షిప్తంగా..

## పికెతో చిరాగ్ చెట్టాపట్టాల్

**పాట్నా, అక్టోబరు 8:** బీహార్‌లో వచ్చే నెలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కొత్త పొత్తు కుదిరే అవకాశం ఉంది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సూరజ్ పార్టీ కూటమి కట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్డీఏ కూటమిలో ఉన్న పాశ్వాన్‌కు కూటమిలోని ఇతర పార్టీలైన బీజేపీ, జేడీయూతో సీట్ల షేరింగ్‌లో లెక్క కుదరడం లేదు. ఎన్డీఏ కూటమిలో షీట్ల షేరింగ్‌పై తాను బీజేపీతో మాత్రమే మాట్లాడుతానని, జేడీయూతో సంబంధం లేదని చిరాగ్అన్నారు. బిజెపి కూడా తన డిమాండ్‌ను ఒప్పుకోకపోతే ఏ క్షణంలోనైనా కూటమి నుంచి బయటికి వెళ్లే ఆప్షన్ తనకు ఉన్నదని అన్నారు.

## 'కమల్‌హాసన్ అంతరాత్మను అమ్ముకున్నారు'



**చెన్నై, అక్టోబరు 8:** ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం చీఫ్, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్‌పై బీజేపీ నేత అన్నామలై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడటంపై మండిపడ్డారు. కమల్ అధికార డిఎంకెకి అనుకూలంగా ఉన్నారని ఆరోపించారు. రాజ్యసభ సీటు కోసం తన ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరూర్ బాధితుల పరామర్శకు వెళ్లి తొక్కిసలాటలో ప్రభుత్వం తప్పు లేదని అంటే ఎవరైనా అంగీకరిస్తారా ఆయన మరీ ఇంత దిగజారాలా అసలు ఆయన మాటలను తమిళనాడు ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని అన్నామలై అన్నారు.

## అధైర్య పడకండి.. నేనొస్తా, ఆదుకుంటా!

**చెన్నై, అక్టోబరు 8:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలతో మంగళవారం విజయ్ వీడియోకాల్‌లో మాట్లాడారు. వారిని ఓదార్చిన ఆయన త్వరలో కరూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. దీనిపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం ఆ తర్వాత సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. ఈ విషాదం వేళ విజయ్‌పై రాజకీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా కరూర్‌లో ఘటనాస్థలిని ఎంఎన్ఎం అధినేత కమల్‌హాసన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమిళగ వెట్రి కళగం సభలో తప్పు జరిగిందని, దానిని ఒప్పుకొని బాధితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దాన్ని కప్పిపుచ్చుకొనేలా ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు.

## బిజెపి నేతపై కాల్పులు.. దుర్మరణం

**బర్హంపూర్, అక్టోబరు 8:** ఒడిశాలోని బరంపురంలో భారతీయ జనతా పార్టీ (బిజెపి) నేత, సీనియర్ న్యాయవాది పీతాబాస్ పాండాను గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా కాల్చి చంపారు. గత రాత్రి ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ కార్యక్రమాన్ని ముగించుకుని రాత్రి 10 గంటల సమయంలో బైకుంఠనగర్‌లోని తన నివాసానికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఇంటి సమీపంలోనే మాటువేసిన ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి పాండాను అడ్డగించారు. అత్యంత సమీపం నుంచి ఆయనపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో పాండా చాతీలోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.

## గ్రేస్ ఓమైలీకి బ్రిటన్ పౌర పురస్కారం

**లండన్, అక్టోబర్ 8:** రెండేళ్ల క్రితం నాటింగ్‌హామ్‌లో స్నేహితురాలిని కాపాడే ప్రయత్నంలో కత్తిపోట్లకు గురై ప్రాణాలు కోల్పోయిన భారత సంతతి యువతి గ్రేస్ ఓమైలీ కుమార్ (19)కి మరణానంతరం బ్రిటిష్ ప్రభుత్వం ద్వితీయ అత్యున్నత పౌర పురస్కారం జార్జ్ మెడల్‌ను ప్రకటించింది. 2023 జూన్ 13న గ్రేస్ తన స్నేహితురాలు జానబీ వెబర్‌తో కలిసి ఇంటికి ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు దాడి జరిగింది. వాల్డోకైలోకేన్ అనే వ్యక్తి వెబర్‌పై వెనకనుంచి కత్తితో దాడి చేయగా, గ్రేస్ ధైర్యంతో అతన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దాడిలో స్నేహితులిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. నిందితుడిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గ్రేస్ క్రీడాకారిణి కూడా. ఆమె ధైర్యం అసలైన శౌర్యానికి మంచి ఉదాహరణ అని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కొనియాడారు. గ్రేస్ కుటుంబ సభ్యులకు పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఇలా మొత్తం 20 మందిని గౌరవిస్తారు.



మంగళవారంప్రజాభవన్‌లో ప్రజావాణిలో చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్-2 సభ్యులు

# ప్రజావాణికి 302 దరఖాస్తులు

## స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

**హైదరాబాద్ (బేగంపేట), అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 302దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణా భివృద్ధి శాఖకు సంబంధించి 87దరఖాస్తులు, ంవెన్యూ శాఖకు సంబంధించి 42దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 102దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 3 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 68దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలియజేసారు.సీఎం ప్రజావాణీ ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్‌అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు వినిసంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

**చిన్నారెడ్డిని సన్మానించిన గ్రూప్ 2 సభ్యులు**

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ -2పరీక్షలలో ఎంపికైన అభ్యర్థులు చిన్నారెడ్డిని మంగళవారం ప్రజాభవన్‌లో శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.గ్రూప్ 2 ఫలితాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో పలు మార్లు అభ్యర్థులు ప్రజాభవన్‌లో జరిగే సీఎం ప్రజావాణీకి వచ్చి చిన్నారెడ్డిని కలవగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ సెక్రటరీలతోఫోన్ ద్వారా మాట్లాడి ధైర్యం నింపిన చిన్నారెడ్డిని కలిసి వారు ధన్యవాదాలు తెలిపి పోస్టింగ్స్ కూడా త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు ఆయనను కోరారు.

# 12 వరకు ఆర్‌టిఐ అవగాహన వారం

## విసిలతో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, ప్రభాతవార్త8 (జర్నలిస్ట్‌ఫైల్):** పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంపై సమచార హక్కు చట్టం(ఆర్‌టిఐ) కీలకంగా మారిందని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిం చడంలో భాగంగా ఈ నెల 5నుంచి 12 వరకు ఆర్‌టిఐ వీక్-2025ను నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఆయన యూనివర్సిటీ విసిలు, రిజిస్ట్రార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్-1 ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం, 2005 ప్రజా స్వామ్య పరంపర, పారదర్శకత, జవాబు దారీతనం కోసం కీలకమైన చట్టమని తెలిపారు. భారతదేశంలో ఆర్‌టిఐ చట్ట చరిత్ర, రాజ్యాంగ పరిరక్షణలు (ఆర్టికల్ 19(1) (ఎ) అండ్ 21) ప్రధానమైన సుప్రీంకోర్టు తీర్పులను వివరించారు. ఆర్‌టిఐచట్టం అంతర్జాతీయ మానవహక్కుల ప్రమాణాలను భారత రాజ్యాంగ హామీలతోకలిపి పనిచేస్తుందన్నారు.ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్4 (పబ్లిక్ అథారిటీల బాధ్యతలు), సెక్షన్ 8(మినహాయింపులు) పై విశేషంగా దృష్టిపెట్టారు. ఏ సమాచారం వెల్లడించవచ్చునో, ఏదికాదు అనే దిశానిర్దేశాలను విసి, రిజిస్ట్రార్లకు వివరించారు.విశ్వవిద్యాలయాలకు ఆర్‌టిఐ క్వెరీస్ నిర్వహణ కోసం సాధారణ బుక్లెట్, హ్యాండ్‌బుక్ తయారీలో భాగస్వామ్యం చేయాలని కోరారు. కార్యక్రమం ముగింపులో ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. అన్ని విశ్వవిద్యాలయాలు ఆర్‌టిఐ వారం (5నుంచి 12 అక్టోబర్) అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఫోటోలు, నివేదికలను ఈనెల 15 నాటికి తెలంగాణ ఇన్ఫర్మేషన్ కమిషన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలికి సమర్పించాలని సూచించారు.

### పిజిఇ సెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో

# 2926 మందికి సీట్ల కేటాయింపు

## 9లోగా కాలేజీల్లో చేరాలి: అడ్మిషన్ల కన్వీనర్ పాండురంగా రెడ్డి

**హైదరాబాద్, 8 (జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎంఈ, ఎంటెక్ ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో చేరడం కోసం నిర్వహించిన పిజిఈసెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు మంగళవారం చేశారు. ఫైనల్ ఫేజ్‌లో 3345 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 2926 మందికి సీట్లకేటాయింపు చేశారు. ఫైనల్ ఫేజ్‌లో 5370 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా వారిలో 2926 మందికి సీట్ల కేటాయింపు చేసినట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 9లోగా ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని సూచించారు. మొదటి విడతలో 5529 సీట్లు అందుబాటులో ఉండగా వాటి కోసం 7471 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు.అందులో 4320 మందికి సీట్ల కేటాయింపు చేయగా వారిలో 2521 మంది కాలేజీల్లో చేరినట్టు తెలిపారు. ఫైనల్ ఫేజ్‌లో 3345 సీట్లకిగానూ 2926 సీట్లను కేటాయించారు.

# కులధ్రువీకరణ పత్రాలు మళ్లీ సమర్పించండి

**హైదరాబాద్, అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర ఆర్టీసిలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టులకు దరఖాస్తు చేసిన ఎస్‌సి అభ్యర్థులు తమ కుల ధృవీకరణ పత్రాలను తాజా జిఓ అనుసారం నూతన ఫార్మట్‌లో సంబంధిత తహసీల్‌దార్ కార్యాలయాల నుంచి తీసుకుని, వాటిని సమర్పించాలని పోలీసు నియామక మండలి కోరింది. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌సి అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రాలను నూతన ఫార్మట్‌లో ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న అదనపు జిఎం సత్యప్రకాష్ తదితరులు

# ఆల్ ఇండియా రైల్వే కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

**తార్నాక, అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ (ఆర్.ఎస్.పి.బి) ఆధ్వర్యంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసి యేషన్ 47వఆల్ ఇండియా రైల్వే కబడ్డీ (మహిళలు) ఛాంపియన్ షిప్ పోటీలను ఈ నెల 7నుండి 10 అక్టోబర్ వరకు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాన్ని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్ మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్, దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఫైనాన్షియల్ అడ్వైజర్ మరియు చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్,స్టోర్స్ వర్క్‌షాప్ పి.కోటేశ్వరరావు ఇతర సీనియర్ రైల్వే అధికారులు మరియు క్రీడా సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. ఈ సంవత్సరం సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్టర్న్ రైల్వే, వెస్ట్రన్ రైల్వే, సెంట్రల్ రైల్వే, ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, నార్త్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్‌కోస్ట్ రైల్వే మరియు ఆతిథ్య వహిస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వేలకు సంబందించిన మొత్తం తొమ్మిదిజట్లు ఈ పోటీలో పాల్గొంటున్నాయి.ఈ టోర్నమెంట్‌లో అంతర్జాతీయ, జాతీయ స్థాయి ఆటగాళ్ళు పాల్గొంటారు. తొలి నాకౌట్ ప్రారంభ మ్యాచ్ దక్షిణ మధ్య రైల్వే,నార్త్ ఈస్టర్న్ రైల్వే మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో దక్షిణ మధ్యరైల్వే 48పాయింట్లు సాధించి విజేతగా నిలువగా, నార్త్ ఈస్టర్న్‌రైల్వే 25 పాయింట్లు సాధించింది.ఈ సందర్భంగా సత్య ప్రకాష్ మాట్లాడుతూ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్లకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి నిజమైన క్రీడా స్ఫూర్తి, నిబద్ధత మరియు కృషిని ప్రదర్శించాలని ఆయన పాల్గొనే వారిని ప్రోత్సహించారు.

# గోల్ఫ్ టోర్నీలో కోరుకొండ విజయఢంకా



**హైదరాబాద్,అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన ఆర్డీ ఇంజినీరింగ్ సైనిక్ స్కూల్స్ అలుమ్ని గోల్ఫ్ టోర్నమెంట్ 2025హైదరాబాద్‌లోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్ లోని బ్యాంక్వెట్ హాల్‌లో ఘనంగా ముగిసింది.గాలా డిన్నర్, అవార్డుల ప్రదానోత్సవంతో ఆ సాయంత్రం సైనిక,సివిల్ అధికారులు, పరిశ్రమ నాయకులు, వ్యాపారవేత్తలు, గోల్ఫ్ అభిమానులతో కళకళలాడింది. 2 రోజుల ఉత్కంఠభరితమైన పోటీల అనంతరం, సైనిక్ స్కూల్ కొరుకొండ చాంపియన్‌గా నిలిచింది.సైనిక్ స్కూల్ చిత్తోర్గఢ్ రన్నరప్ స్థానం సాధించింది. ఆర్డీ ఇంజినీరింగ్ లిమిటెడ్ ఛైర్మన్, ఎండి చంద్రశేఖర్ మోటూరు విజేతలకు చాంపియన్ షిప్ ట్రోఫీ అందచేశారు.

# అడ్డదారులు తొక్కిన అధికారులు

## ఎసిబి చిక్కిన డ్రగ్ కంట్రోల్ అధికారులు

**కరీంనగర్ క్రైమ్, 8 (జర్నలిస్ట్‌ఫైల్):** ప్రజలకు నమ్మకం కలిగించేందుకు నిరం తరం ఫార్మసీలను తనిఖీలు చేసి నాణ్యమైన మందులు, సేవలందిస్తున్నారని నిర్ధారించాల్సిన అధికారులు అడ్డదారులు తొక్కారు. ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఫార్మసీని తనిఖీచేసి సర్టిఫికెట్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్‌చేసి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా మంగళవారం జిల్లా కేంద్రంలో పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రతి జిల్లా కేంద్రానికి డ్రగ్ కంట్రోల్ విభాగం ఉంటుంది.ఫార్మసీలను, అనుమతులు లేకుండా మార్కెట్లో లభ్యమయ్యే మందులను తనిఖీలు చేసి వాటి వినియోగంపై పూర్తిస్థాయి సమాచారం ఇవ్వాల్సిన పని డ్రగ్ కంట్రోల్ విభాగం విధి. ప్రతి ఏటా ప్రైవేట్ ఆస్పత్రుల ఫార్మసీ దుకాణాలను తనిఖీలు చేసి సర్టిఫై చేయాల్సి ఉంటుంది.అదేవిధంగా ఫార్మసీస్ట్ లైసెన్సులు పునరుద్ధరించడం వారి విధుల్లో భాగం..అయితే దీనికోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గల ఫార్మసీకి క్లీన్ చిట్ ఇచ్చేందుకు డ్రగ్ కంట్రోల్ విభాగం అధికారులు డబ్బులు డిమాండ్ చేశారు.అధికారుల అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోవడంతో మందుల దుకాణాల నిర్వాహకులు అవినీతి నిరోధకశాఖ అధికారులను సంప్రదించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు మంగళవారం రంగంలోకిదిగారు. బాధితుని నుంచి డిమాండ్ చేసిన లంచం డబ్బులు రూ.20,000 అధికారులకు చెందిన ఓ ప్రైవేటు వ్యక్తి తీసుకుంటుండగా దాడులు నిర్వహించడంతో రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు.డబ్బులు తీసుకున్న రామును అదుపులోకి తీసుకొని అతనిని పురమాయించిన డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాసులు,డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి లంచంగా తీసుకున్న డబ్బులను రికవరీచేసి రసాయన పరీక్షలు నిర్వహించి, నిర్ధారించి అధికారులు ఎసిబి కార్యాలయానికి తరలించి విచారణ అనంతరం నిందితుల ముగ్గురిని కరీంనగర్ ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు.



# భీమ్ పోరాట స్ఫూర్తి ప్రపంచానికి ఆదర్శం: మంత్రి జూపల్లి



**హైదరాబాద్,అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** జల్.. జంగిల్.. జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీం పోరాట స్ఫూర్తి తెలంగాణకే కాదు యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఆదివాసీల ఆరాధ్యదైవం కుమ్రం భీం 85వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కుమ్రం భీం విగ్రహానికి సంప్రదాయ బద్ధంగా నివాళర్పించి,సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి పూజలు చేసి భీం స్మృతి చిహ్నం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ ఆదివాసీల ఆశాజ్యోతి కుమ్రం భీం పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందని, ప్రజల కోసం, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం.. బానిసత్వపు సంకెళ్ల తెంచడానికి తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని, స్వయంపాలన ఉద్యమానికి పితామహుడిగా నిలిచిన కుమ్రం భీం చరిత్ర భావితరాలకు ఆదర్శనీయమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్, కొమ్రం భీం మనువడు సోనేరావు, ఆదివాసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# డిజిపి కార్యాలయంలో వాల్మీకి జయంతి



**హైదరాబాద్, అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు డిజిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి, ఈ సందర్భ ంగా వాల్మీకి చిత్ర పటానికి శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించడంతో పాటు వాల్మీకి సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. మహర్షి వాల్మీకి ఆలోచనలు, ఆత్మ నిబ్బరత, సత్యం ధర్మం కోసం ఎంతో సేవలు చేశారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐజి రమణ కుమార్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వాల్మీకులపై ప్రభుత్వం చిన్నచూపు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**హైదరాబాద్,అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** బిజెపి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పుష్పాం జలి ఘటించి, ఆయన స్ఫూర్తిదాయక జీవితాన్ని స్మరించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహర్షి వాల్మీకి వారసత్వానికి సంబంధించిన వర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. వాస్తవానికి వాల్మీకి సమాజం వెనుకబడిన తరగతులలో భాగంగా ఉంది. అయితే వాల్మీకి సమాజాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండి పడ్డారు.ఇటీవల గద్వాల ప్రాంతంలో బోయ వాల్మీకి సోదరులు నన్ను కలిసి తమ సమస్యలను వివరించారని,వారికి ఎమ్మార్వో ఆఫీసుల్లో కనీసం కుల ధృవపత్రాలు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకి సమాజం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందని ఇప్పటికైనా వాల్మీకి బోయల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ నేతలు బిజెపి నేతలను విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నారు:బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ కాంగ్రెస్ నాయకులు నిత్యం బీజేపీ నేతలను విమర్శించడమే తమ ధ్యేయంగా పెట్టుకున్నారని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచం దర్ రావుపై ఇష్టాను సారంగా, అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేస్తున్నార న్నారు. ఒక రాజకీయ పార్టీలో మంత్రి పదవిని పొందిన పొన్నం ప్రభాకర్ వంటి నాయకులు దిగజారి మాట్లాడటం తగదని హితవు పలికారు. మొన్నటికి మొన్న సొంత మంత్రివర్గం లోని మాదిగ సమాజానికి చెందిన అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌పై పొన్నం ప్రభాకర్ కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం సమాజం చూసిందన్నారు. భారతీయ జనతా పార్టీ మొదటి నుండి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విష యంలో మద్దతు తెలిపిందని,బిజెపి ఎమ్మె ల్యేలు సంపూర్ణ మద్దతు ప్రకటిం చారని గుర్తుచేశారు.



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

# మంత్రి పొన్నం క్షమాపణలు చెప్పాలి

## సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండిస్తున్నాం: మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్(తార్నాక), అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల ముందు నిర్వహించిన కార్యక్రమంలో మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన కట్లూర్ లక్ష్మణ్ ఉద్దేశించి దున్నపోతు అనేమాటను ఉపయోగించి మాట్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు తప్పు జరిగింది వాస్తవమే నని పొన్నం చేతక్షమాపణ చెప్పించే విధంగా చూస్తామని తెలిపారని అన్నారు. పొన్నం ప్రభాకర్ క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యచరణను తీసుకోవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సందే కార్తిక్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ముశేఖర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి, పల్లెర్ల సుధాకర్, బైర పోగు శివకుమార్, జన్న పాల మహేష్, ఎడవెల్లి అజయ్, ఆదిత్య, మంద అనీల్ మాదిగ, మహేంద్ర మదిగ, మామిడి ప్రశాంత్, రవికుమార్, అజయ్ కుమార్, కొమ్ము తురుపతి, మణేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మంగళవారం వివరాలు వెల్లడిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# రిజర్వేషన్లపై 30 బిసి సంఘాల కేసులు

**హైదరాబాద్,అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** స్థానిక సంస్థలలో బీసి రిజర్వేషన్లు 42 శాతం రిజర్వేషన్ల కేసులో 30కి పైగా బీసీ సంఘాలు మంగళవారం తెలంగాణ హైకోర్టులో ఇంప్లిట్ కేసులు వేశారు.కేసులో ఇంప్లీడ్ అయిన వారిలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణ, కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, తెలంగాణ బీ.సి మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి పగడాల కావణి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి, బీసీ విద్యార్థి యువజనసంఘం అధ్యక్షుడు జామ్మూర్తి గౌడ్, తెలంగాణ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేందర్, తెలంగాణ బీ.సి ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, కార్మికసంఘం నేత చెదుకు మణికంఠ, తెలంగాణ బీ.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, గ్రేటర్ అధ్యక్షుడు బి.సాగర్, తెలంగాణ బీ.సి విద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పగళ్ళ సతీష్, తెలంగాణ బీ.పి యువజన సంఘం కన్వీనర్ భాస్కర్ ప్రజాపతి, నాయి బ్రాహ్మణ సంఘం నేత జగదేశ్. జాతీయ బీ.సి సంక్షేమ సంఘం నేత పరదాల సుధాకర్ తదితర సంఘం ప్రతినిధులు పెద్ద ఎత్తున కేసులు వేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికారం ఇచ్చింది కావున అసెంబ్లీ చట్టం చేశారు. జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీల కేసులు గెలిచే అవకాశం ఉందన్నారు.

# మద్యం, గంజాయి, నల్లబెల్లం స్వాధీనం

**హైదరాబాద్,అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** వేర్వేరు కేసుల్లో ఎక్సైజ్ అధికారులు 44 మద్యం బాటిళ్ళను,2.5 కేజిల గంజాయి,120 కేజిల బెల్లంను మంగళవారం పట్టుకున్నారు.ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వచ్చే తెలంగాణ ఏక్స్ ప్రెస్ రైల్లో సికింద్రాబాద్ డిటిఎఫ్ సిఐ సౌజన్య సిబ్బంది కలిసి నిర్వహించిన తనిఖీల్లో 44 మద్యం బాటిల్లు పట్టుబడ్డాయి.ఈ మద్యం బాటిళ్లను సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. అదే విధంగా నాంపల్లి మెట్రో స్టేషన్ సమీపంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని ఎస్‌టిఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి ఇచ్చిన సమాచారంమేరకు ఎస్టీఎఫ్ ఏ టీం లీడర్ సిబ్బంది దాడులు నిర్వహించి తనిఖీల్లో 2.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.గంజాయితోపాటు టు వీలర్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని హాట్ గోడ సంజయ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.ఈ కేసులో సంజయ్ తో పాటు శేఖర్ బాబు, క్రామే బాబు, గంగోలి బహు అనే ముగ్గురు పై కూడా కేసు నమోదు చేశారు.

మరో కేసులో హైదరాబాద్ హైదరాబాదు ఎంజీబీఎస్ బస్ స్టేషన్ నుంచి నాగర్ కర్నూల్ కు బస్సులో తరలిస్తున్న బెల్లాన్ని ఎస్టీఎఫ్ బీ టీం సీఐ భిక్ష రెడ్డి ఎస్సై బాలరాజు సిబ్బంది కలిసి పట్టుకున్నారు. బెల్లాన్ని తీసుక వెళుతున్న ఎల్లమ్మ అనే మహిళను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 120 కేజీల బెల్లం, 30 కేజీల ఆలమును స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ స్టేషన్‌లోఅప్పగించారు.అదే విధంగా మరో కేసులో నాగర్ కర్నూల్‌కు హైదరాబాదు నుంచి బయలుదేరినటువంటి బొలెరో వాహనాన్ని బిటిఎఫ్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకుని అందులోని 900 కేజీల బెల్లాన్ని, 20 కేజీల ఆలమును, వాహనాన్ని నాగర్ కర్నూల్ డి టి ఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. బొలెరో వాహనంతో పాటు బిజినేపల్లి భాస్కర్ రెడ్డి, డ్రైవర్ రాంబాబును అరెస్ట్ చేశారు.

# టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడాలి: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలంటే ఆవిష్కరణ, నైపుణ్యం మీద దృష్టి సారించాలి: డాక్టర్ క్రిష్ణా ఎల్లా

### ఘనంగా హెచ్‌సియు స్నాతకోత్సవం




స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, భారత్ బయోటెక్ చైర్మన్ క్రిష్ణ ఎల్లా తదితరులు. అవార్డులను అందజేస్తున్న హెచ్‌సియు చాన్సిలర్ నర్సింహారెడ్డి, వైస్ చాన్సిలర్ బిజె.రావు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్):** టెక్నాలజీ మానవాళికి ఉపయోగపడే విధంగా ఉండాలని, దానిని భర్తీ చేయకూడదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, హెచ్‌సియు చీఫ్ రెక్టార్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. విద్య సమాజంలో సమగ్రమైన, అందరికీ సమానమైన సమాజాన్ని నిర్మించే విధంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 25వ స్నాతకోత్సవ వేడుకలను మంగళవారం బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎక్జిక్యూటీవ్ చైర్మన్ క్రిష్ణ ఎల్లా ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈ సంవత్సరం మొత్తం 1717మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్లు ప్రకటించగా, అందులో 990మంది తమ పట్టాలను అందుకున్నారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ మెరుగైన భవిష్యత్తుకు ఆలోచన, విద్యార్థుల కష్టానికి వేడుకగా స్నాతకోత్సవాన్ని అభివర్ణించారు. మానవుడి ఉనికి అంతిమ లక్ష్యం మేధస్సును పెంచడమే కావాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాటలను ఉటంకించారు. నేటి యువతకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి, తోటి వారికి సేవ చేసేందుకు ఉపయోగించాలని సూచించారు. పట్టాలు అందుకున్న గ్రాడ్యుయేట్లు వనయాన్ని వదులుకోవద్దని, ఇతరులకు అవకాశాలు సృష్టించే విధంగా ఎదగాలని పిలుపునిచ్చారు. భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు క్రిష్ణ ఎల్లా మాట్లాడుతూ భారతదేశాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలంటే మన యువత ఆవిష్కరణలు, నైపుణ్యం మీద దృష్టి సారించాలని సూచించారు. విశ్వవిద్యాలయం డిగ్రీ పట్టాను ఇస్తుందని, కానీ ఉత్తమ ఆవిష్కరణ, నైపుణ్యం జీవితంలో ముందుకు తీసుకువెళ్తాయని అన్నారు. నేటి విద్యార్థులు ఉద్యోగాల వేటలో పడి ఉద్యోగ అన్వేషకులుగా మారుతున్నారని, ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న సామాజిక సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. కోవిడ్ మహమ్మారి సమయంలో భారతీయ శాస్త్రవేత్తల సందేహాలు వ్యక్తం చేశారని, కానీ కోవిడ్ వ్యాక్సిన్‌ను సొంతంగా తయారు చేసి భారతీయుల సైన్స్‌ను, మేధోసంపత్తిని ప్రపంచానికి చూపించామన్నారు.

హెచ్‌సియు వైస్ చాన్సిలర్ బిజె.రావు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఒక విశ్వవిద్యాలయం మాత్రమే కాదని, ఇది ఒక గ్రీన్ క్యాంపస్ అని అన్నారు. ప్రపంచ క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో హెచ్‌సియు గత సంవత్సరం ఉన్న 372నుంచి ఈ సంవత్సరం 335కు చేరిందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, నూతన టెక్నాలజీలో సవాళ్లను పరిష్కరించేందుకు 6 విశ్వవిద్యాలయాలను అనుసంధానం చేస్తూ 100కోట్లతో ఏర్పాటు చేసిన ఎఎన్‌ఆర్‌ఎఫ్ ప్రాజెక్టుకు హెచ్‌సియు నాయకత్వం వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దృష్టి లోపాన్ని అధిగమించి ఎంఎ పొలిటికల్ సైన్స్‌లో పట్టా అందుకున్న విద్యార్థిని గోపితేజస్వికి ఓబిసి కేటగిరి గోల్డ్‌మెడల్‌ను అందజేశారు. జంతు, జీవ శాస్త్రంలో పిహెచ్‌డి పట్టా పొందిన కాశ్మీర్ విద్యార్థి డాక్టర్ మహమ్మద్ సుల్తాన్ ఖాన్‌కు ప్రొఫెసర్ ఏనుగు రామస్వామి నాయుడు పథకాన్ని అందజేశారు. ఉత్తమ విద్యాబోధన చేసిన 5గురు ప్రొఫెసర్లకు చాన్సిలర్ అవార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సియు చాన్సిలర్ డాక్టర్ ఎల్.నర్సింహారెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

**విజయవాడ, అక్టోబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**



మహర్షి వాల్మీకి జీవితం.. ఆయన సమాజానికి అందించిన రామాయణ మహా కావ్యం గొప్ప స్ఫూర్తిదా యకమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవం మంగళ వారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వాల్మీకి.. మహామునిగా, కవిగా, మహర్షిగా తన జీవితాన్ని మలు చుకోవడమే కాకుండా ఆత్మీయమైన, అద్భుతమైన రామాయణ మహా కావ్యాన్ని ఈ సమాజానికి అందించడం ద్వారా గొప్ప సందేశాన్ని అందిం చారన్నారు. మనిషి సంకల్పిస్తే ఏదైనా సాధించగలమని వాల్మీకి జీవితం ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. మహనీయుల స్ఫూర్తి పథాన్ని భావిత˘రాలకు అందించాలనే గొప్ప లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# న్యాయవాది పజ్జూరు రామకృష్ణ కు ఘన నివాళి



**మైలవరం, అక్టోబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

మైలవరం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మాజీ అధ్యక్షులు మాజీ ఏజీపీ గా బాధ్యతలు నిర్వహించి అనారోగ్యంతో బాధపడుతూ పజ్జూరు రామకృష్ణ సోమవారం రాత్రి మృతి చెందారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళ వారం ఉదయం రామకృష్ణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మైలవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామకృష్ణ సంతాప సభ నిర్వహించి, కోర్టు హాల్లో జడ్జి ఎం శైలజ సంతాప సభలో పాల్గొని పజ్జూరు. రామకృష్ణ కు నివాళులర్పించారు. ముందుగా పజ్జూరు రామకృష్ణ చిత్రపటానికిబార్ అసోసియేషన్ అధ్యక్షులు రావూరి రమేష్ బాబు పూలమాల వేయగా, సీనియర్ న్యాయవాదులు పీవీ శేషగిరిరావు ఎస్ వి కే సత్యనారాయణ రావు బుద్ధవరపు వెంకటరావు,వీటి కిషోర్, మైలవరం కోర్టు ఏ జి పి ఏడీ ప్రసాద్ ,మధు ఆంజనేయులు,ఓర్సు శ్రీనివాసరావు ముల్లంగి రవికుమార్, పివి సాంబశివరావు, ఎం శరత్ బాబు, బి దినేష్, ఎం తనూజ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



**మైలవరం, సెప్టెంబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం వెల్వడం గ్రామం లోని వరవకట్ట ప్రాంతాని చెందిన ఎస్ టీ కాలనిలోని చలమచర్ల మధు అనే వ్యక్తి ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం మధ్యాహ్న సమయంలో పూర్తి గా కాలిపోయింది.,వాళ్ళు కట్టుబట్టలతో మిగిలిపోయారు. ఈ విషయం తెలుసుకొని వెల్వడం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం వారి దగ్గర కు వెళ్లి కాలిపోయిన ఇంటిని పరిశీలించి వారికి మంచం, వంటసమాగ్రి, నిత్యావసర సరుకులు, బట్టలు మరియు కూరకాయలు మరియు కొంత నగదును వారికి సాయం గా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రత్తిపాటి ప్రభాకర్,గుంజి రాంప్రసాద్, అంబటి శ్రీనివాసరెడ్డి,పొన్నం సతీష్,చనుమోలు వెంకటరత్నం,గుంజి పాపారావు,గోచిపాత నవీన్, గరికపాటి జయరాజు, పొదిలి రోశయ్య, ప్రత్తిపాటి నాగేశ్వరావు,ప్రత్తిపాటి కిరణ్,ప్రత్తిపాటి సురేష్ పోతురాజు నాగేశ్వరావు, వేముల నాగరాజు, బెల్లంకొండ వీరరాజు, యలమల వెంకటేశ్వరరావు,రాంబాబు, బాబు, పౌల్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యాహ్నామే మూతబడ్డ సచివాలయం




**వికోట, అక్టోబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

చిత్తూరు జిల్లా, వికోట మండలం బోడిగుట్లపల్లి గ్రామ పంచాయతీ బోడిగుట్లపల్లి సచివాలయ సిబ్బంది తీరుతో స్థానికులు ,ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామానికి వెళ్లిన సిబ్బంది ఎంతసేపటికీ రాకపోవడంతో సచివాలయ తలుపులు తెరుచుకోలేదు. అనునిత్యం ప్రజాసేవలో తరించాల్సిన సిబ్బంది అలసత్వంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# 8న పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ పర్యటన

## కలెక్టర్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ సంస్థల వార్షిక నివేదికలపై సమీక్ష: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, అక్టోబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ నాయకత్వంలో శాసనసభ నుండి ఏడుగురు సభ్యులు మరియు శాసన మండలి నుండి ముగ్గురు సభ్యులు గా గల కమిటీ ఈ నెల 8వ తేదీ బుధవారం ఎన్.టి.ఆర్. జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా పరిధిలో వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లు మరియు పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ సంస్థల వార్షిక నివేదికలు, కార్యకలాపాలను ఈ కమిటీ సమీక్షించనుందన్నారు.కమిటీ 8వ తేదీ బుధవారం ఉదయం 11.00 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో విజయవాడ ప్రాంతం పరిధిలో టూరిజం, ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్, ఏపీ గ్రీనింగ్ & బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ లిమిటెడ్, ఏపీ స్టేట్ సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఏపీ కోఆపరేటివ్ ఆయిల్‌సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ లిమిటెడ్, ఏపీ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, ఏపీ అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ తదితర సంస్థలకు సంబంధించిన కార్యకలాపాలపై అధికారులతో చర్చించనుందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆ ప్రకటనలో తెలిపారు.

# సమిష్టి కృషితోనే సంబరాలు విజయవంతం





- దసరా మహోత్సవ యజ్ఞంలో భాగస్వాములైన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు, ధన్యవాదములు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ
- ఒక అద్భుత ఘట్టం ముగిసింది
- విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్ బాబు
- కృష్ణానదికి రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన తరుణంలో నిర్వహించిన ఈ దసరా ఓ కేస్ స్టడీ
- వివిఎంసి కమిషనర్ ధ్యాన చంద్ర
- దసరా మహోత్సవాల ప్రశాంత నిర్వహణపై జిల్లా యంత్రాంగానికి అభినందనలు
- అధికారులకు ప్రశంసాపత్రాల అందజేత

**విజయవాడ, అక్టోబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

దసరా ఉత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహించడానికి కారకులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ధన్యవాదాలు తెలిపారు. దసరా నవరాత్రులను విజయవంతంగా ముగియడంపై అన్ని శాఖల అధికారులతో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ , నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, వియంసి కమిషనర్ ధ్యానచంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ తొక్కిసలాటలు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడంలో సఫలమయ్యామని చెప్పారు. ఈసారి దసరా 11 రోజులు నిర్వహించామని, భక్తులు గత సంవత్సరం కంటే అధికంగా, 16.5 లక్షలు వచ్చారని, అయినా ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి సమన్వయంతో దర్శన ఏర్పాట్లు చేసామని చెప్పారు. గత సంవత్సరం దసరా అనుభవాలతో నగర పోలీస్ కమిషనర్ ఒక పుస్తకం రూపొందించారని, ఇప్పుడు అన్ని శాఖల అభిప్రాయాలతో ఒక పుస్తకాన్ని రూపొందిస్తామని చెప్పారు. భవిష్యత్తులో దసరా నిర్వహణకు ఈ పుస్తకం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఫీడ్ బ్యాక్ ను లిఖితపూర్వకంగా తెలప వచ్చున్నారు. ఉత్సవాల సక్రమ నిర్వహణకు సహకరించిన అన్ని శాఖల అధికారులతోపాటు గుంటూరు, కృష్ణ జిల్లాల కలెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

**అద్భుతంగా పనిచేశారు : విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్ బాబు**

విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం దసరా ఉత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేయడం తన 27 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో ఎదుర్కొన్న అతిపెద్ద సవాలు అని చెప్పారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులతో పాటు, కార్నివాల్ కు వచ్చిన వారిని కూడా పరిగణనలోకి తీసుకుంటే 20 లక్షలు అవుతారని, ఇంతమందికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడడం సాధారణ విషయం కాదన్నారు. గత సంవత్సరం తొక్కిసలాట జరుగుతుందేమో అని కొన్ని సందర్భాల్లో భయపడ్డానని, ఈసారి అందుకు ఆస్కారం లేకుండా చక్కటి ప్రణాళి కతో నిర్వహించామని తెలిపారు. ఎవరైనా నేరస్తులు వస్తున్నారా అనేది తెలుసుకోవడానికి 1,44,000 మంది ఫోటోలతో ఎఫ్ ఆర్ ఎస్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల క్యూలైన్లు, పాసుల విషయంలో గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. రూ. 500, టికెట్లను తీసివేయటం సత్ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీసు సిబ్బంది కూడా అద్భుతంగా పనిచేశారని కితాబిచ్చారు.

**పూర్తి సమన్వయం ఉంటే అద్భుతాలు : వివిఎంసి కమిషనర్ ధ్యాన చంద్ర**

వివిఎంసి కమిషనర్ ధ్యాన చంద్ర మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ రోజులో మూడుసార్లు సాధారణ భక్తుడిగా క్యూలైన్లో వెళ్లి దర్శనం చేసుకున్నారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని లోపాలు ఏవైనా ఉంటే వెంటనే సరిదిద్దు ఎందుకు వీలుగా ఒక కలెక్టర్ ఇన్నిసార్లు క్యూ లైన్ లో వెళ్లడం ఇదే మొదటిసారని చెప్పారు. పూర్తి సమన్వయం ఉంటే అద్భుతాలు జరుగుతాయనడానికి ఈ ఉత్సవాల నిర్వహణే నిదర్శనమన్నారు. రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన సమయంలో నిర్వహించిన ఈ దసరా ఒక కేస్ స్టడీగా నిలిచిపోతుందని చెప్పారు. డీసీపీ సరిత మాట్లాడుతూ ప్రణాళిక, సన్నద్ధత, అమలు మూడూ సక్రమంగా జరగటం వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. అన్ని శాఖల మధ్య చక్కటి సమన్వయం ఉండడానికి కలెక్టర్, సిపి, వియంసి కమిషనర్లు చేసిన కృషే కారణమన్నారు. దసరా మహోత్సవాలు విజయవంతం కావడానికి కృషిచేసిన అధికారులకు కలెక్టర్, పోలీస్ కమిషనర్, వి ఎం సి కమిషనర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కె.చైతన్య, కే.మాధురి, కే.బాలకృష్ణ, డిఆర్ఓ ఎం. లక్ష్మీ నరసింహ, అన్ని శాఖల జిల్లా అధికారులు, వివిఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆది దంపతుల విహారం





**నృత్య కళాకారుల సందడి**

**విజయవాడ, అక్టోబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆది దంపతుల గిరి ప్రదక్షణ అత్యంత స్వాభావికంగా వైభవంగా పౌర్ణమి రోజు జరిగింది. శ్రీ విశ్వవసునామ సంవత్సర ఆశ్వయుజ పౌర్ణమి మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరి స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఆదిదంపతుల గిరి ప్రదక్షణను అట్టహాసంగా నిర్వహిం చారు. ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ వారు, మల్లేశ్వరి స్వామి వారి పౌర్ణమి గిరి ప్రదక్షిణ సందర్భంగా మంగళవారం ఉదయం ఘాట్ రోడ్డు కామదేను అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించి కొబ్బరికాయ కొట్టి గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. దుర్గగుడి నూతన చైర్మన్ బొర్రా రాధా కృష్ణ , ఈఓ శీనా నాయక్ దేవాదాయ శాఖ ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ జె సి భ్రమరాంబ ఆధ్వర్యంలో ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, శ్రీనివాస్ శాస్త్రి తో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గిరిప్రదక్షిణ పాదయాత్రను ప్రారంభించారు.పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో గంగా భారతి సమేత మల్లేశ్వర స్వామివార్ల కు ఇంద్రకీలాద్రి చుట్టూ నిర్వహించిన గిరి ప్రదక్షణ ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ఘాట్ రోడ్డు కామదేను అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమైన ఈ గిరిప్రదక్షిణలో భాగంగా స్వామి వారు, అమ్మవారు నగర పురవీధుల్లో విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈ గిరి ప్రదక్షణలో అశేష సంఖ్యలో భక్తజనం ఉత్సాహంగా పాల్గొనగా, కనుల పండుగ జరిగిన ఈ దృశ్యాలను తిలకించిన భక్తులు ఆనంద పరవశంలో మునిగిపోయారు. గిరి ప్రదక్షణ సాంప్రదాయాన్ని అనుసరించి వేలాదిమంది భక్తుల సమక్షంలో ఆధ్యాత్మిక వాతావరణంలో సాంప్రదాయ కళా ప్రదర్శనలతో అత్యంత ఉత్సాహకర వాతా వరణంలో కొనసాగింది. పౌర్ణమి రోజున ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వల్ల కోరిన కోరికలు నెరవేరి సుఖసంతోషాలు అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

# దుర్గమ్మకి కాసుల వర్షం

**దసరా ఆదాయం రూ.10.30 కోట్లు 387 గ్రాముల బంగారం, వెండి 19.450 కేజీలు**

**విజయవాడ, అక్టోబర్ 8(జర్నలిస్ట్‌ఫైల్):**



శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా.. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువు తీరిన దుర్గమ్మ తల్లికి కనక వర్షం కురిసింది. ఈ ఉత్సవాలకు తరలి వచ్చిన లక్షలాది మంది కనక దుర్గమ్మకు బంగారం, వెండి, స్వదేశీ కరెన్సీ సహా విదేశీ డాలర్లను కానుకలుగా సమర్పించారు. ఈ 11 రోజుల దసరా ఉత్సవాల తరువాత మూడు రోజులు అత్యధికంగా భవానీలు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలోని హుండీలన్నింటినీ దేవస్థానం అధికారులు లెక్కించారు. ఆలయంలోని మహా మండపం ఆరవ అంతస్తులో సోమ, మంగళవారాల్లో తెరచి కానుకలను లెక్కించారు.ఆలయంలోని 56 హుండీలు, 243 బ్యాగులను తెరచారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి శీనా నాయక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. రూ 10,30,95,521లు నగదు , 387 గ్రాముల బంగారం, 19 .450 కిలోల వెండి ఆభరణాలను భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. విదేశీ డాలర్లు, కేశఖండన, దర్శన టిక్కెట్లు, ప్రత్యేక పూజ టికెట్లు ఇలా అన్ని విధాలుగా ఆదాయం గత ఏడాదితో పోల్చుకుంటే పెద్ద ఎత్తున సమకూరింది. గత ఏడాది దసరా ఉత్సవాల సందర్భంగా హుండీ లెక్కింపులో రూ 9,32,94,018లు నమోదు కాగ.. ఈ ఏడాది వీటికి అదనంగా మరో కోటి రూపాయల అదనపు ఆదాయం లభించింది. ఈ ఏడాది దసరా ఉత్సవాల సందర్భంగా సుమారు రూ 15 కోట్ల పైగా జరిగింది.

# తేమ శాతం ఆధారంగా పత్తి కొనుగోళ్లు

- నిర్ణయించిన తీసుకున్న సిసిఐ..!
- తేమ 12% మించ కూడదు
- 12 శాతం కన్నా తక్కువ ఉంటే ప్రోత్సాహం
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** పత్తి కొనుగోళ్లకు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వచ్చే ఏడాదికి కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. దీన్ని ప్రకారం పత్తి కొనుగోళ్లు చేయాల్సి ఉంటుందని సి సి ఐ సూచించింది. నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన పత్తికి మాత్రమే మద్దతు ధర చెల్లిస్తారు. పత్తిలో తేమ శాతం 12కి మించితే కొనుగోలు చేయలేమని సీసీఐ తేల్చి చెప్పింది. తక్కువగా ఉంటే తగిన విధంగా పత్తి రైతులను ప్రోత్సహిస్తామని సంబంధిత అధికారులు వెల్లడించారు. అంతేకాదు తమ శాతం 8 కన్నా తక్కువ ఉంటే ప్రోత్సాహకాలను కూడా ప్రకటిస్తామని సీసీఐ అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు. మరో రెండు నెలల్లో కొత్త పత్తి మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈసారి పత్తి కొనుగోళ్లలో ఎక్కడ వివాదాలు లేకుండా సిసిఐ తొలి నుంచి పక్కా ప్రణాళికను రూపొందించుకోవాలని కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. అయితే 12 శాతం కన్నా ఎక్కువ తేమ ఉంటే కొనుగోలు చేయలేమని చెప్పిన నిబంధన కొంతవరకు రైతులకు ఇబ్బందే అని చెబుతున్నారు. గత ఏడాది రైతులు తీసి చెప్పిన విధంగా పత్తిలో తేమ శాతాన్ని కంట్రోల్ చేయడంలో సఫలీకృతులయ్యారు. దీన్నిబట్టి 12 శాతానికన్నా ప్రేమ తక్కువగా ఉంటే ఆ రైతుకు మంచి గిట్టుబాటు ధర దక్కే అవకాశం ఉంది. అంతేకాదు పత్తిలో తేమ తో పాటు మరికొన్ని నిబంధనలను కూడా సిసిఐ కఠిన తరం చేసినట్లు చెబుతున్నారు. ఇప్పటికీ ఒక్క తేమశాతం మీద మాత్రమే సిసిఐ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పత్తి మార్కెట్లోకి వచ్చాక రైతులను దృష్టిలో ఉంచుకొని మరికొన్ని నిబంధనలను సడలించే అవకాశం కూడా లేకపోలేదు. పత్తి పింజ పొడవు, గుడ్డి పత్తి ధరల విషయంలో కూడా కొంతమేరకు సడలింపు ఉండే అవకాశం ఉంది.

తొలుత కొనుగోలు చేసే పత్తిలో 8% కంటే తక్కువ తేమ ఉంటే ప్రోత్సాహకాన్ని అందిస్తామని కూడా ప్రకటించారు 8 నుంచి 12% మధ్య ఉంటే ధర నిష్పత్తి ప్రకారం తగ్గుతుందని సీసీఐ అధికారులు వెల్లడించారు. కేంద్ర ధరల నిర్ణయక సంఘం ప్రకటించిన విధంగా పత్తికి మద్దతు ధర చెల్లిస్తారు. పొడవాటి దూది(లాంగ్ స్టేపుల్)కి క్వింటాలుకు రూ. 8,110, మధ్యస్థ దూదికి రూ. 7,710 మద్దతు ధర చెల్లిస్తామని పేర్కొంది. దీనికి అనుగుణంగా తాజా మార్గదర్శకాలను జారీ చేసింది. ఏటా పత్తి కొనుగోళ్లకు సీసీఐ తేమ విషయంలో నిబంధనలు జారీ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వాల విజ్ఞప్తుల మేరకు వాటిని సడలిస్తోంది. అయితే ఈ ఏడాది కూడా ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతంపై ఉన్న నిబంధనలను కొంత మేరకు తగ్గించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. తేమశాతం విషయంలో గత ఏడాది పలు రాష్ట్రాల్లో కొన్ని వివాదాలు తలెత్తాయి. అయితే ఈ ఏడాది ఇలాంటి సమస్య రాకుండా తొలి నుంచే సిసిఐ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు, ఐ ఆర్ రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇప్పటికే కోరాయి. అసలు పత్తి మార్కెట్లోకి రాకముందే ముందే ఏడాది ఇప్పుడే నిబంధనలు విడుదల చేయడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా, పూత ,దశల్లో ఉన్న పంట మరో నెల లేదా 45 రోజుల్లో మార్కెట్కు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసారి భారీ వర్షాలతో తేమ శాతం తగ్గుతుందని గుబులు చెందుతున్నారు.

సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని శుద్ధి చేసి, బేళ్లుగా కట్టి రవాణా చేసే పని కోసం జాబ్‌వర్క్ టెండర్లను ఈసారి. పిలుస్తోంది. గత ఏడాది కొత్త నిబంధనలు తేవడంతో వాటిని నిరసిస్తూ కాటన్ మిల్లులు టెండర్లకు దూరంగా ఉన్నాయి. దీంతో గత ఏడాది నవంబరు 15 వరకు కొన్నిచోట్ల కొనుగోళ్లు జరగలేదు. చివరికి రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో నిబంధనలను సడలించి కొనుగోళ్లు చేపట్టింది. తాజాగా గత నెల 9న సీసీఐ ఈ సంవత్సరానికి జాబ్‌వర్క్ టెండర్లను పిలిచింది. ఇందులో గత ఏడాది కంటే నిబంధనలను కఠినతరం చేసింది. గతంలో నెలనెలా దూది శాతం పెరుగుదల నిబంధన ఉండగా.. ఇప్పుడు ప్రతి పక్షం రోజులకు పెంచాలని నిర్దేశించింది. జిన్నింగ్‌లో తరుగుదల శాతం గతంలో 1.70 వరకు ఉండగా.. ఇప్పుడు దాన్ని సగానికి కుదించింది. మిల్లులను సౌకర్యాలపరంగా ఎల్1, ఎల్2 కేటగిరీలుగా విభజించి వాటిలో అనుకూలమైన వాటికి పత్తి పంపుతామని తెలిపింది. ఇందులో ఆధునిక వసతులు, సీసీ కెమెరాలు వంటి నిబంధనలు విధించింది. గత నెల 31 వరకు గడువు విధించింది. సీసీఐ నిబంధనలు అమలుచేయడం కోసం ప్రయత్నిస్తోంది. అయితే ఈసారి పత్తి కొనుగోళ్లలో ఇలాంటి ప్రతికూల పరిస్థితులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోబోతోంది.

## పొన్నూరు సి.హెచ్.సి కి అంబులెన్స్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** పొన్నూరు సి.హెచ్.సి కి అంబులెన్స్ వచ్చింది. పొన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం (సిహెచ్సి) లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆసుపత్రికి అంబులెన్స్ అవసరం ఉందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడారు. ఈ మేరకు బుధవారం నాటికి ఆసుపత్రికి అంబులెన్స్ చేరింది. తన పర్యటనలో పారిశుధ్యం, మెరుగైన వైద్య సేవలు అందించుటకు చర్యలు చేపడతామన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో ముఖాముఖి మాట్లాడి అందుతున్న సేవలు పై ఆరా తీశారు. ఆసుపత్రిలో మందులు సరఫరా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో మంచి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. అవసరమగు అన్ని మందులు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. ఆసుపత్రికి వస్తున్న వ్యక్తులలో పరిశుభ్రత అంశాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు ఆసుపత్రి పర్యవేక్షకులు ఆసుపత్రి లో అందిస్తున్న సేవలను వివరించారు.

## ప్రభుత్వమే వైద్య కళాశాలలను కొనసాగించాలి




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 590 జీవో ద్వారా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విజయవాడలోని ఎమ్.బి భవన్ ఆడిటోరియంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాఎం ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 8వ తేదీన గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో మాజీ శాసనమండలి సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, వై.ఎస్.ఆర్.సి.పి విద్యార్థి విభాగ గుంటూరు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. వినోద్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. డాఎం ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగితేనే పేదల అభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. సేవారంగంలో కొనసాగాల్సిన విద్య, వైద్యాన్ని ప్రైవేటు రంగానికి తరలించడం భావ్యం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని పి పి పి విధానాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థి యువజన సంఘాలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులందరినీ అక్టోబర్ 19న జరిగే రాష్ట్ర సదస్సుకు ఆహ్వానించి ఉద్యమ కార్యాచరణతో భవిష్యత్తు పోరాట కార్యక్రమాలను ప్రకటిస్తామన్నారు. మాజీ శాసనమండలి సభ్యులు కె. ఎస్. లక్ష్మణరావు ప్రసంగిస్తూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలలో ఐదింటిని పూర్తిచేసి ప్రవేశాలు కల్పించిందని, మరో రెండు కళాశాలలు నిర్మాణం పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్న తరుణంలో నేటి కూటమి ప్రభుత్వం 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పరోక్షంగా ప్రైవేటు పరం చేయాలని భావించడం దుర్మార్గమన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేయడాన్ని సిద్ధంగా ఉన్న ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్యను అందించే 10 ప్రభుత్వ వైద్య కళాశాలల పై 5 వేల కోట్లు ఖర్చు చేయలేని దీనస్థితిలో ఉందా అని ప్రశ్నించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలపై పెట్టే పెట్టుబడులను వ్యయంగా భావించరాదని, దేశాభివృద్ధికి ఉన్నతమైన మానవ వనరుల అభివృద్ధిగా భావించాలన్నారు. పి పి పి ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు సంస్థలు ఉద్యమిస్తున్నాయని, వాటిన్న%శీ%టిని ఏకత్రాటి పైకి తీసుకొచ్చి ఐక్య ఉద్యమ నిర్మాణం కోసం రాష్ట్ర సదస్సును అక్టోబర్ 19న విజయవాడలో ఎం.బి. భవన్ లో నిర్వహిస్తున్నామని తెలుపుతూ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## నగరంలో అభివృద్ధి కార్యక్రమాలను తనిఖీ చేసిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బుధవారం తనిఖీ చేశారు.

కాకుమానుగూడ ప్రాంతం, బి.ఆర్.స్టేడియం, పి.వి.కె.నాయుడు పెద మార్కెట్, అంబేద్కర్ భవన్ మరియు స్టడీ సెంటర్, కృష్ణా నగర్ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద ఆడిటోరియం, గోరంట్లలో నీటి పథకం, మానస సరోవరం, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్, నల్లపాడు చెరువు, ఐ.టి.సి రోడ్ లలో పలు కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచనలు చేస్తూ జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలన్నారు.

మానస సరోవరం, నల్లపాడు చెరువు అత్యుత్తమ పర్యాటక ప్రదేశాలుగా విరాజిల్లే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

నగరంలో చేపడుతున్న కార్యక్రమాలను గుంటూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, పర్యవేక్షక ఇంజినీర్ సుందరరామి రెడ్డి వివరించారు. మానస సరోవరం డి.పి.ఆర్ తయారీకి ఏపీటో్కకు ఇవ్వడం జరిగిందని చెప్పారు. పి.వి.కె.నాయుడు పెద మార్కెట్, నగరపాలక సంస్థ కార్యాలయం వీటన్నిటిని ఆధునీకరించేందుకు ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.

జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఆంధ్రా ప్రెసిడెంట్ మరియు బిజినెస్ హెడ్ ఎం.వి.చారి ప్లాంట్ కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఉత్తమ పనితీరుతో ప్లాంట్ నడుస్తుందన్నారు. ప్లాంట్ కార్యకలాపాకు జరుగుతున్న అన్ని విభాగాలను జిల్లా కలెక్టర్ కు చూపించి వాటి పనితీరును వివరించారు.

బి.ఆర్ స్టేడియం లో విద్యుత్తు దీపాల ఏర్పాటు, కాలువల ఏర్పాటు అవసరం ఉందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నర్సింహారెడ్డి చెప్పారు. స్టేడియంలోకి వర్షపు నీరు ప్రవేశించడం వలన బురదమయంగా తయారవుతుందని తద్వారా ప్రజలు మార్నింగ్ వాక్కు చేయడానికి అవకాశం ఉండటం లేదని చెప్పారు.

నల్లపాడు చెరువు వద్ద కొత్తగా లేఅవుట్ వేయడం వలన వర్షాలు ఎక్కువ కురిసినప్పుడు రహదారి పూర్తిగా మునిగి పోవడం జరుగుతుందని, రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని ప్రజలు వివరించారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, గుంటూరు నగర పాలక సంస్థ సిటీ ప్లానర్ రాంబాబు, జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, తహసిల్దార్ వెంకటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## తెరుచుకోనున్న శబరిమల అయ్యప్ప ఆలయం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** శబరిమల అయ్యప్ప భక్తులకు బిగ్ అప్డేట్. శబరిమల అయ్యప్ప ఆలయాన్ని తులం మాస పూజల కోసం అక్టోబర్ 17– 22 వరకు తెరవనున్నారు. ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని తెరవనున్నట్లు ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు (టీడీబీ) ప్రకటించింది.

ఉదయాస్తమాన పూజ, పడిపూజ, కలశాభిషేకం, పుష్పాభిషేకం వంటి ఐదు రోజుల ప్రత్యేక ఆచారాల తర్వాత అక్టోబర్ 22న రాత్రి 10 గంటలకు మూసివేస్తామని తెలిపింది. దర్శనం కోసం వర్చ్యువల్ టికెట్లు జారీ చేయనున్నట్లు వెల్లడించింది.

శబరిమల అయ్యప్ప ఆలయం ఈ నెల 17వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు తెరవనున్నట్లు ఆలయ బోర్డు వెల్లడించింది. ఇదే సమయంలో గర్భగుడి ముందున్న ద్వారపాలక విగ్రహాలకు బంగారు పూతపూసిన రాగి తాపడాలను ఆలయం తెరిచిన వెంటనే అంటే అక్టోబర్ 17న ఏర్పాటు చేస్తామని ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు స్పష్టం చేసింది. కేరళ హైకోర్టు, ఆలయ ప్రధాన పూజారి నుంచి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. శబరిమల అయ్యప్పను దర్శించుకోవాలని అనుకునే భక్తులు వర్చువల్ క్యూ విధానంలో దర్శన టికెట్లు పొందొచ్చని తెలిపారు. తులం మాస దర్శనం కోసం బుకింగ్‌లు అధికారిక వెబ్ సైట్ ద్వారా ప్రారంభమయ్యాయి. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలకు ఆన్‌లైన్ బుకింగ్ నుంచి మినహాయింపును ఇచ్చారు.

ప్రస్తుతం వర్చువల్ క్యూ వ్యవస్థను నిర్వహిస్తున్న కేరళ పోలీసులు భక్తుల భద్రత గురించి చర్యలు తీసుకుంటున్నారు. రోజువారీ యాత్రికుల సంఖ్యను పరిమితం చేసే వర్చువల్ క్యూ వ్యవస్థను, అంచనా వేసిన రద్దీని నిర్వహించడానికి అమలు చేస్తున్నారు. కాగా, శబరిమల ఆలయంలోని విగ్రహాల బంగారం తాపడం బరువు తగ్గడంపై జరుగుతున్న వివాదంపై కేరళ దేవస్వమ్ మంత్రి కె. రాధాకృష్ణన్ స్పందించారు. శబరిమల వద్ద అన్ని కార్యకలాపాలు పూర్తి పారదర్శకతతో జరుగుతున్నాయని చెప్పారు. ఈ అంశంపై హైకోర్టు పూర్తి విచారణకు ఆదేశించిందని, నివేదికను అందిన తర్వాత నిందితులపై తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## 11న అదనపు గదుల నిర్మాణ ప్రారంభోత్సవం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** 1922 లో బాలికల విద్య కోసం స్థాపించిన శారదానికేతనము అదనపు గదుల నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమం ఈనెల 11వ తేదీన గుంటూరులోని 2/14 బ్రాడీపేటలో నిర్వహిస్తున్నట్లు శారదానికేతనము సెక్రటరీ టి. శ్రీనివాస్, పూర్వ సెక్రటరీ జి. శ్రీనివాసరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, లయన్స్ పూర్వ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాష్, ప్రిన్సిపాల్ బి. కోటి రత్నం, హెడ్మాస్టర్ ఎన్. ఉషా కుమారి లు తెలిపారు. ఈనెల 8వ తేదీన గుంటూరులోని శారదానికేతనము విద్యా సంస్థల ప్రాంగణంలో జరిగిన మీడియా సమావేశంలో శారదానికేతనము సెక్రటరీ టి. శ్రీనివాస్ ప్రసంగిస్తూ శారదానికేతనము అదనపు గదుల నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాఎం పెమ్మసాని చంద్రశేఖర్, లోక్ సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవి, మాజీ మంత్రివర్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఏపీ ఈడబ్ల్యూ ఐడీసీ చైర్మన్ ఎస్. రాజశేఖర్ తో పాటు మాజీ శాసనమండలి సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ డైరెక్టర్ చిగురుపాటి వరప్రసాద్, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు డాఎం బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, పోలిశెట్టి శ్రీహరి ప్రసాద్ రావు, జాగర్లమూడి మురళీమోహన్, గ్రంధి కాంతారావులు పాల్గొంటారని తెలిపారు. గత 100 సంవత్సరాలుగా శారదానికేతనము అభివృద్ధికి తోడ్పడిన దాతలందర్నీ ఆహ్వానిస్తున్నామని, గుంటూరు నగర ప్రముఖులకు ఆహ్వానాలు అందించామని వివరించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 1920వ దశాబ్దంలో మహిళా అక్షరాస్యత ఒక్క శాతం మాత్రమే ఉన్న సందర్భంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నవ లక్ష్మీనారాయణ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ దంపతులు బాలికలకు ఉచితంగా విద్యను అందించడానికి భోజన, వసతితో కూడిన శారదానికేతనమును స్థాపించినారని తెలిపారు. 1925లో మునగాల జమీందారు శ్రీ రాజా నాయని వెంకట రంగారావు, బహుద్దూర్ 1.90 ఎకరాల భూమిని వారి మనవడు సుదర్శన రెడ్డి స్మారక చిహ్నంగా దానం చేశారని తెలిపారు. కొండా వెంకటప్పయ్య గారు, జాగర్లమూడి కుప్పు స్వామి చౌదరి, నాట్కో సంస్థ, వసుధ ఫౌండేషన్, తమ్మారెడ్డి భరద్వాజ, పోలిశెట్టి శ్రీహరి ప్రసాద్ రావు, డాఎం బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి, సినీ నటులు త్రిపురనేని సాయి చంద్ లాంటి దాతల సహకారంతో శారదానికేతనం అభివృద్ధి చెంది నేడు 550 మంది విద్యార్థినులతో వికసిస్తుందన్నారు. వందలాదిమంది తెలుగు, సంస్కృత అధ్యాపకులుగా ఉద్యోగాలు పొందినారన్నారు. 1930వ దశాబ్దంలో మహాత్మా గాంధీజీ శారదానికేతనము సందర్శించినారని పేర్కొన్నారు. లయన్స్ పూర్వ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాష్ మాట్లాడుతూ కాంద్రు సింగారావు మెమోరియల్ కమిటీ నూతన తరగతుల నిర్మాణానికి ముందుకు వచ్చిందని తెలిపారు. శారదానికేతనము విద్యాసంస్థల అభివృద్ధికి లయన్ చిగురుపాటి వరప్రసాద్ సేవా యజ్ఞం స్ఫూర్తితో సహకరిస్తామని తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## కూటమి ప్రభుత్వం కాదు.."కళ్ళుండీ చూడలేని కబోది ప్రభుత్వం"



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** చిన్నతనంలోనే అమ్మా నాన్నా ఇద్దరినీ పోగొట్టుకున్నాడు. ఆపై వినికిడి శక్తిని కూడా కోల్పోయాడు. ఆదుకునేందుకు అయిన వారు సైతం లేరు. అయినా మొక్కవోని మనోధైర్యంతో ముందుకు సాగాడు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో క్రమశిక్షణగా విద్యను అభ్యసించాడు.

ప్రస్తుతం గ్రూప్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఇతని పేరు దాసరి మరియబాబు. గుంటూరు నగరంలోని బొంగరాలబీడుకు చెందిన మరియబాబుకు వైయస్ జగన్ ముఖ్యమంత్రిగా కల గత ప్రభుత్వంలో దివ్యాంగుల కోటాలో సక్రమంగా ఫించన్ అందింది. కాబట్టి తన బతుకు బండితో పాటు చదువు సంధ్యలను కూడా ఎలాగొలా నడిపించుకుంటూ వచ్చాడు.

అయితే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్యాయంగా తొలగించిన దివ్యాంగుల పెన్షనర్ల జాబితాలో ఇతనికి కూడా చోటు దక్కింది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు 40శాతం వైకల్యం ఉంటే.. వారు ఫించన్ పొందేందుకు పూర్తిగా అర్హులు. అయితే మరియబాబుకు 80శాతం వినికిడి లోపం ఉన్నా కూడా ఆయనను అనర్హుడిగా అధికారులు ప్రకటించారు. అదేమని అడిగితే పునః పరిశీలన చేస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారు తప్ప తనకు న్యాయం చేయడం లేదని మరియబాబు ఆరోపించారు.

ఈ నేపథ్యంలో తన లక్ష్య సాధనకు ఆటంకం కలిగి స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలైన ఆలా కిరణ్, కాటూరి విజయ్ వద్ద తన ఆవేదనను, ఆందోళనను వ్యక్తం చేశారు. దీంతో వెంటనే స్పందించిన కిరణ్, విజయ్ ఇద్దరూ సదరు విషయాన్ని గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) దృష్టికి తీసుకెళ్లారు. వారు మల్లెల శంకర్‌రెడ్డి అనే దాత ద్వారా శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి చేతుల మీదుగా మరియబాబుకు ఆర్థిక సాయం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, విధివంచితులైన దివ్యాంగుల పట్ల ఈ ప్రభుత్వం అత్యంత క్రూరంగా వ్యవహరిస్తోందని, పింఛన్ల మీద ఆధారపడి జీవించే దివ్యాంగుల విషయంలో రాజకీయాలు చేయడం అత్యంత దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఆర్థిక భారం పేరుతో దివ్యాంగుల పింఛన్లు తొలగించడానికి కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఆర్భాటాల కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్, మంత్రి నారా లోకేష్ చేసే ఖర్చులో ఈ అభాగ్యులకు ఇచ్చేది అణువంత కూడా కాదని స్పష్టం చేశారు. దివ్యాంగుల కష్టాలను కళ్లుండీ చూడలేని ఈ ప్రభుత్వమే అసలైన మానసిక వైకల్యంతో బాధపడుతున్న కబోది ప్రభుత్వమని ఆయన తేల్చి చెప్పారు. దివ్యాంగులకు వైయస్సార్సీపీ అండగా నిలబడి పోరాడుతుందని, ఎవరూ అందోళన చెందవద్దని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మనోధైర్యం చెప్పారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), దూపాటి వంశీ, ఆబిద్, బత్తుల దేవానంద్, షేక్ రబ్బానీ, గనిక జాన్సీ, ఆలా కిరణ్, కాటూరి విజయ్, సమీవుల్లా, మేకా రవి, నందేటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌కు కనువిప్పు కలగాలి

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలో ఉన్నంతకాలం రాష్ట్ర విధ్వంసానికి అహర్నిశలూ కృషి చేసిన జగన్‌రెడ్డి ప్రతిపక్షంలో కూడా అదే తీరును కొనసాగించడం అత్యంత ఆందోళనకరమని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. అతి తర్వలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే...పిపిపి విధానంలో ఎవరూ పాల్గొనవద్దని హెచ్చరికలు చేయడం మాజీ సిఎం వికృత మానసికతకు అద్దం పడుతుందని మంత్రి తెలిపారు.

**జగన్ నిర్వాకానికి నర్సీపట్నం ప్రతీక :** రూ.500 కోట్ల వ్యయంతో నర్సీపట్నం వైద్య కళాశాల నిర్మాణానికి మార్చి,2021లో అనుమతించిన మాజీ సిఎం జూన్,2024లో అధికారంనుండి వైదొలగేనాటికి ఈ కాలేజీ నిర్మాణానికి కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఇది మొత్తం వ్యయంలో కేవలం 2.14 శాతం మాత్రమేనని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ కాలేజీ అవసరాల కోసం మొత్తం 12.19 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా...జగన్‌రెడ్డి హయాంలో కేవలం 0.89 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో పనులు చేపట్టారని మంత్రి తెలిపారు. దీనికి భిన్నంగా ఈ కాలేజీ నిర్మాణ పనులను పిపిపి విధానంలో శీఘ్రతరం చేసేందుకు వీలుగా కూటమి ప్రభుత్వం అవసరం మేరకు రూ. 13.10 కోట్లు వెచ్చించిందని మంత్రి తెలిపారు.

2025-26 విద్యా సంవత్సరంలో నర్సీపట్నం వైద్య కళాశాలలో 150 ఎంబిబియస్ ప్రవేశాలు కల్పిస్తామని మాజీ సిఎం ప్రజలకు హామీ ఇచ్చారని, అయితే ఈ లక్ష్యానికనుగుణంగా కృషి చేయలేదని మంత్రి ఎత్తిచూపారు. తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో 2024-25లో ప్రవేశాల కల్పనకు నిర్మాణ వ్యయం రూ.500 కోట్లలో రూ.400 కోట్లు వెచ్చించిన మాజీ సిఎం నర్సీపట్నం కాలేజీలో మరుసటి సంవత్సరంలోనే ప్రవేశాలు కల్పించాల్సి ఉన్నా కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే వ్యయం చేయడాన్ని మంత్రి ప్రశ్నించారు. ఈ వ్యయం కూడా నాబార్డ్ నిధులతో చేశారని మంత్రి పేర్కొన్నారు.

ఇదే నిర్లక్ష్యం 2025-26లో ఒక్కో కాలేజీలో150 ప్రవేశాలు జరగాల్సిన మిగతా 10 కాలేజీలకు సంబంధించి కూడా జరిగిందని, తద్వారా సమీప భవిష్యత్తులో ఈ కాలేజీలు ఉనికిలోకి రాని దుస్థితి ఎదురైందని మంత్రి తెలిపారు. ఉత్తరాంధ్రలోని పార్వతీపురం కళాశాల రూ.600 కోట్లతో నిర్మించాల్సి ఉన్నా, జగన్‌రెడ్డి తాను అధికారంలో ఉన్నంతకాలం కనీసం భూసేకరణ కూడా జరగలేదని...ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం 2025-26లో 150 ప్రవేశాలు ఎలా కల్పిస్తుందని జగన్‌రెడ్డిని మంత్రి సత్యకుమార్ యాదవ్ నిలదీశారు. 2022-23లో ప్రవేశాలు జరిగిన విజయనగరం వైద్య కళాశాల మొత్తం వ్యయం రూ.500 కోట్లలో జగన్ ప్రభుత్వం కేవలం రూ.110 కోట్లు మాత్రమే వ్యయం చేసిందని...కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే ఈ కాలేజీపై రూ. 71 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి వెల్లడించారు.

**జగన్‌రెడ్డికి మంత్రి ప్రశ్నలు :** గురువారంనాడు నర్సీపట్నం పర్యటిస్తున్న మాజీ సిఎం జగన్‌రెడ్డికి మంత్రి సత్యకుమార్ యాదవ్ 10 ప్రశ్నల్ని సంధించి, బహిరంగంగా సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు:

1) పులివెందుల మెడికల్ కాలేజీ పట్ల అత్యంత శ్రద్ధను కనబరిచిన మీరు నర్సీపట్నం, పార్వతీపురం కాలేజీల నిర్మాణాల్ని ఎందుకు పూర్తిగా నిర్లక్ష్యం చేశారు?

2) నర్సీపట్నం కాలేజీలో 2025-26లో 150 ఎంబిబియస్ ప్రవేశాలు కల్పిస్తామని మీరు ప్రజలకు హామీ ఇచ్చారా...లేదా?

3) ఆ మేరకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన మీరు అధికారం నుండి 2024లో వైదొలగేనాటికి కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే వెచ్చించడం ఎంతవరకు సబబు? మీ అసమర్థతను కప్పిపుచ్చుకుంటూ కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఉచితమా?

4) అధికారంలో ఉన్నప్పుడు ఏనాడైనా నర్సీపట్నం కాలేజీని సందర్శించారా? కాలేజీ నిర్మాణపు పనుల ప్రగతిని ఒక్కసారైనా సమీక్షించారా? అలా చేయకపోవడానికి కారణాలేంటి?

5) 2025-26లో ప్రవేశాల కల్పన దృష్ట్యా నర్సీపట్నం కాలేజీ నిర్మాణ పనుల్ని వేగవంతం చేయాలని ఏనాడైనా అధికారుల్ని ఆదేశించారా?

6) నర్సీపట్నం కాలేజీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో పనుల ప్రగతి ఆధారంగా ఆర్థిక సహాయాన్ని చేయడానికి కేంద్రప్రభుత్వ సంస్థ నాబార్డ్ అంగీకరించినా, మీ హయంలో మూడేళ్లలో కేవలం రూ.10.70 కోట్లు మాత్రమే ఖర్చు చేయడానికి కారణం మీ అసమర్థతా లేక ఆ ప్రాంత ప్రజల పట్ల నిర్లక్ష్యమా?

7) ఏ లక్ష్యంతో నర్సీపట్నం మెడికల్ కాలేజీ పర్యటనకు సిద్ధమయ్యారు? వాస్తవాలను తెలుసుకోవడానికి లేక అసత్యాలను కొనసాగించడానికా?

8) మీ నిర్వాకంతో కుదేలైన నర్సీపట్నం వైద్య కళాశాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వాన్ని ఏ విధంగా బాధ్యులు చేయగలరు? రాష్ట్రంలో ప్రభుత్వ కాలేజీల్లో మేనేజ్మెంట్ సీట్ల వార్షిక ఫీజును రూ. 12 లక్షలకు, ఎన్నారై సీట్ల ఫీజును రూ. 20 లక్షలకు పెంచినది ఎవరు? విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 17 కాలేజీల నిర్మాణం కేవలం ప్రభుత్వ నిధులతోనే సాధ్యం కాదని ఆనాడు మీరు చెప్పారా లేదా?

9) పిపిపి పద్ధతిలో నర్సీపట్నం కళాశాలలో వైద్య విద్యను ఆశించే వారికి ఏవిధంగా నష్టం కలుగుతుంది? పిపిపి విధానంలో మన విద్యార్థులకు సీట్ల లభ్యత పెరిగే వాస్తవాన్ని కాదనగలరా?

10) వాస్తవాల్ని తెలుసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పగలిగే ఆత్మశుద్ధి, మనోధైర్యం మీకున్నాయా?

ఈ 10 ప్రశ్నలకు బహిరంగంగా స్పందించి, నర్సీపట్నం వైద్య కళాశాల మరియు ఇతర కళాశాలల నిర్మాణం విషయంలో చర్చకు అంగీకరించాలని మాజీ సిఎం జగన్‌రెడ్డికి వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సవాల్ విసిరారు.

## చిల్లపల్లి కుమార్తె వివాహంలో లోకేష్



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) ఛైర్మన్, మంగళగిరి నియోజకవర్గ జనసేన ఇంఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు కుమార్తె వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులు చాముండేశ్వరి, సాయి వివేక్ లను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కల్తీ లిక్కర్‌ను ఉపేక్షించవద్దు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో కల్తీ లిక్కర్ తయారీ, అమ్మకాలను ఏ మాత్రం ఉపేక్షించవద్దని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కల్తీ లిక్కర్‌తో ప్రజల ప్రాణాలను హరించే వారిపై కఠిన చర్యల ద్వారా ఉక్కుపాదం మోపాలని సీఎం స్పష్టం చేశారు. 15 నెలల్లో పటిష్ట చర్యల ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికట్టామని...ఇంతే సమర్థవంతంగా పనిచేసి రాష్ట్రంలో కల్తీ లిక్కర్ అనేది లేకుండా చేయాలని చెప్పారు. ఏ ఒక్క చోటా కల్తీ లిక్కర్ తయారీ కేంద్రాలు కానీ, అటువంటి వ్యక్తులు కానీ ఉండకూడదని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్నమయ్య జిల్లాలో కల్తీ లిక్కర్ వ్యవహారంలో తీసుకున్న చర్యలను, దర్యాప్తు వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరవు కేసులో మొత్తం 21 మంది నిందితులుగా గుర్తించామని...అందులో ఇప్పటికి వరకు 12 మందిని అరెస్టు చేశామని...మిగితా నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ములకలచెరువు కేసులో ఎ1 గా ఉన్న అద్దేపల్లి జనార్ధన్‌రావు లావాదేవీలు, వ్యాపారాలపై విచారణ జరపుతున్నామని తెలిపారు. ముకలచెరువు కేసుల ఆధారంగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో జనార్ధన్‌రావుకు చెందిన వ్యాపారాలపై తనిఖీలు జరిపామని తెలిపారు. ఈ తనిఖీల్లో కిరాణా షాప్ వెనుక కల్తీ మద్యం నిల్వలను గుర్తించినట్లు తెలిపారు. అద్దేపల్లి జనార్ధన్‌రావు ఇబ్రహీంపట్నంలోని మెస్సర్స్ %ాచీ=% బార్ %ఒ% రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. అతను 15 సంవత్సరాలుగా మద్యం వ్యాపారం చేస్తున్నాడు. అధిక లాభాల కోసం నకిలీ మద్యం తయారీ ద్వారా చట్ట విరుద్ధ కార్యక్రమాలు నిర్వహించారు. తన సోదరుడు అద్దేపల్లి జగన్ మోహన్ రావు ద్వారా కల్తీ మద్యం తయారీ, సరఫరా, అమ్మకం చేపట్టాడు. వీరిద్దరు కొందరితో కలిసి కల్తీ మద్యం తయారు చేసినట్లు తనిఖీల్లో గుర్తించామని అధికారులు తెలిపారు. ఇక్కడ జరిపిన తనిఖీల్లో కల్తీ లిక్కర్ సీసాలు పట్టుకున్నామని తెలిపారు. ఇక్కడ కల్తీ లిక్కర్ వ్యవహారంలో మొత్తం 12 మందిని నిందితులుగా గుర్తించామని వీరిలో ముగ్గురిని ఇప్పటికి అరెస్టు చేశామని తెలిపారు. నలుగురిని పీటీ వారెంట్‌పై తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. నిందితుల కాల్ రికార్డులతో పాటు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని అధికారులు వివరించారు.

**కఠినంగా వ్యవహరించండి...ఫేక్ ప్రచారంపైనా చర్యలు తీసుకోండి :** కల్తీ లిక్కర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసిన ముఖ్యమంత్రి.....ఈ మొత్తం వ్యవహారంలో పలు కీలక సూచనలు చేశారు. అన్నమయ్య జిల్లాలో జరిగిన కల్తీ లిక్కర్ వ్యవహారంపై రాష్ట్రంలో రాజకీయ పక్షాలు తప్పుడు ప్రచారంతో రాజకీయ ప్రయోజనం కోసం ప్రయత్నం చేస్తున్నాయని సీఎం అన్నారు. రాష్ట్రం అంతటా కల్తీ లిక్కర్ అని తప్పుడు ప్రచారంతో ప్రజలను భయపెడుతున్నారని....ప్రతి మూడు బాటిల్స్‌లో ఒక బాటిల్ కల్తీ లిక్కర్ బాటిల్ ఉందని ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీఎం అన్నారు. రాష్ట్రంలో కల్తీ లిక్కర్‌తో ప్రాణాలు పోతున్నాయని ఫేక్ ప్రచారాలు మొదలు పెట్టిన విషయాన్ని మంత్రులు కూడా అర్థం చేసుకోవాలని.... వైసీపీ నేతల రాజకీయ కుట్రలను ఎప్పటికప్పుడు భగ్నం చేయాలని సూచించారు. కల్తీ లిక్కర్ కారణంగానే అక్కడ చనిపోయారు...ఇక్కడ చనిపోయారు అని ప్రచారం చేస్తున్నారని.... ప్రతీ ఆరోపణ పైనా విచారణ జరపించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైతే పోస్టుమార్టం వంటి విధానాల ద్వారా మృతికి కారణాలు సైంటిఫిక్‌గా నిర్ధారించి...వాస్తవాలు వెల్లడించాలని అధికారులను ఆదేశించారు. ఏది నిజమో చెప్పడంతో పాటు..రాజకీయ కుట్రల్లో భాగంగా సహజ మరణాలపై తప్పుడు ప్రచారాలు చేసేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కల్తీ లిక్కర్‌తో మరణాలు అని ప్రచారం చేస్తే దానికి రుజువు చూపాలని అడగాలని...తప్పుడు ప్రచారం అని తేలితే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సీఎం అన్నారు. మీడియా అయినా, సోషల్ మీడియా అయినా తప్పుడు ప్రచారం చేస్తే ఉపేక్షించవద్దని సీఎం స్పష్టం చేశారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి లాభం పొందుదామనుకుంటే ప్రభుత్వం, ప్రభుత్వ శాఖలు సైలెంట్‌గా చూస్తూ ఊరుకోవని సీఎం హెచ్చరించారు.


**ఏ అంశాలు లేకనే తప్పుడు ప్రచారం :** ఈ సమావేశానికి మంత్రులు కొల్లు రవీంద్ర, లోకేష్ నేరుగా హాజరవ్వగా..హోంమంత్రి సహా పలువురు మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. 2019లో వివేకా హత్య సమయంలో వైసీపీ ఆడిన డ్రామాలు, శవ రాజకీయాలను మరిచిపోవద్దని చెప్పారు. వాళ్లు ఫేక్ ప్రచారంతోనే ప్రజలను నమ్మించాలనే ప్రయత్నంలో ఉంటారని...మీరు మరింత చురుగ్గా, వేగంగా వాటిని తిప్పికొట్టాలని అన్నారు. ఈ విషయంలో వైసీపీ గత చరిత్ర, వారి కుట్ర రాజకీయాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. ప్రతి ఘటనపైనా, ప్రతి సమస్యపైనా ప్రభుత్వం స్పందిస్తోందని, ప్రభుత్వంపై విమర్శలు చేయడానికి వైసీపీకి ఏ కారణాలు దొరకడం లేదన్నారు. అందుకే తప్పుడు ప్రచారాలతో రాద్ధాంతం చేయాలని చూస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం...దీంతో విమర్శలకు అవకాశం లేని వైసీపీ....తమ రాజకీయ సిద్ధాంతమైన ఫేక్ ప్రచారాన్నే నమ్ముకుందని సీఎం దుయ్యబట్టారు. అయితే ప్రజలు ఇప్పుడు వీటిని నమ్మే పరిస్థితి లేదని....అయినా మంత్రులుగా, ప్రజా ప్రతినిధులుగా ఏది మంచి ఏది చెడు అనేది ప్రజలకు వివరించే బాధ్యత మనపై ఉందని సీఎం చంద్రబాబు అన్నారు.

## ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్ ఆవిష్కరణ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి జర్నలిస్టులు రూపొందించిన 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి ప్రెస్ క్లబ్ కమిటీకి, జర్నలిస్టులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాజధాని ప్రాంతంలోని జర్నలిస్టులు అంతా కలిసి ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి ఏర్పాటు చేసుకోవడంతో పాటు నేడు వెబ్ సైట్‌ను రూపొందించుకోవడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. అమరావతి నిర్మాణంలో ముఖ్యమంత్రి ఆలోచనల స్ఫూర్తితోనే 2018లో 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' పురుడుపోసుకుందని కమిటీ సభ్యులు చెప్పారు. నాటి నుంచి ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి తరుపున పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ప్రభుత్వ సహకారంతో ఇప్పుడు అమరావతిలో ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపట్టి...రాజధానిలో అమరావతి ప్రెస్ క్లబ్‌ను ఒక మంచి కేంద్రంగా గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని...ఈ క్రమంలో దేశంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రెస్ క్లబ్ లను కూడా పరిశీలించి డిజైన్లు రూపొందించామని కమిటీ సభ్యులు తెలిపారు. అమరావతి ప్రెస్ క్లబ్ ద్వారా రాజధానిలో మీడియా తనవంతు పాత్ర పోషించాలనేది తమ ఆకాంక్షగా వెల్లడించారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ముఖ్యమంత్రిని కోరగా...ఆయన సానుకూలంగా స్పందించారు. రాజధానిలో మీడియా అవసరాలు తీర్చడానికి సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి వెబ్ సైట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అప్పాజీ, జనరల్ సెక్రటరీ సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ నారాయణ, ట్రెజరర్ కె.పూర్ణచంద్రరావు, జాయింట్ సెక్రటరీ మహేష్, కమిటీ సభ్యులు శ్యామ్ సుందర్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, కె.గాంధీబాబు, అనిల్ పాల్గొన్నారు.

## పీఎం పర్యటనపై సీఎం సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 16వ తేదీన ఏపీలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఈ సమీక్షలో మంత్రులు నారా లోకేష్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని, కందుల దుర్గేష్ పాల్గొన్నారు. సీఎస్, డీజీపీలు సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ క్రమంలో అమరావతి, విశాఖల్లో ప్రధాని పాల్గొన్న కార్యక్రమాలను మించిన స్థాయిలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటనను సక్సెస్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తన పర్యటన సందర్భంగా ప్రధాని శ్రీశైల భ్రమరాంబ, మల్లిఖార్జున స్వామిని దర్శనం చేసుకోనున్నారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే బహిరంగ సభకు హాజరు కానున్నారు. కేంద్రం తెచ్చిన జీఎస్టీ-2.0 సంస్కరణలను స్వాగతించి.. దేశంలోనే తొలిసారిగా అసెంబ్లీలో అభినందనల తీర్మానం చేసింది ఏపీ ప్రభుత్వం. అలాగే జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ పేరుతో దసరా నుంచి దీపావళి వరకు పెద్ద ఎత్తు ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. ఈ క్రమంలో జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రధాని పాల్గొనే ఈ సభను విజయవంతం చేసేలా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ సభ నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రధాని పర్యటన సందర్భంగా వాతావరణ పరిస్థితులను చూసుకుని.. దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రధాని సభకు వచ్చే సభికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని... ఆహారం, తాగునీరు సౌకర్యం కల్పించాలని... సభకు వచ్చే అప్రోచ్ రోడ్లను పూర్తి చేయాలని.. పార్కింగ్ నిమిత్తం ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## మెగా డీఎస్సీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టాలి: ఏపీటీఎఫ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిఎస్సీ 2025 ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు,ఎస్.చిరంజీవి ప్రభుత్వాన్ని కోరారు.

డిఎస్సి 2025 నందు సెలెక్ట్ కాబడిన నూతన ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సిలింగ్ ద్వారా పాఠశాలల ఎంపిక జరపాలని నిర్ణయంతో నూతన ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఎస్.జి అసిస్టెంట్లు 1650 మంది దాకా వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవడం ఆయా గ్రామాలపై ఏమాత్రం అవగాహన ఉండదని, చాలా ఇబ్బందికరంగా ఉంటుందని తెల్పారు. కావున వారి ర్యాంకులకు అనుగుణంగా పాఠశాలలను ఎన్నిక చేసుకోవడానికి మాన్యువల్ కౌన్సిలింగ్ మాత్రమే నిర్వహించాలని ఎపిటిఎఫ్ పక్షాన ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రతి మంగళవారం మహిళా గ్రీవెన్స్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా "మహిళా గ్రీవెన్స్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎన్డీయే కూటమి మహిళా నేతలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నియోజకవర్గములో ఉన్న మహిళల సమస్యలను నేరుగా విని పరిష్కరించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి మహిళ తన సమస్యను ధైర్యంగా ముందుకు తీసుకురావాలన్నారు. మంగళవారం జరిగే మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతే నా ప్రాధాన్యం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

ఎన్డీయే కూటమి మహిళా నేతలు తమ ప్రాంతాల్లో మహిళలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వారికి అండగా నిలబడే నాయకులకే నిజమైన గుర్తింపు లభిస్తుందని గళ్ళా మాధవి స్పష్టం చేశారు.

మహిళా సాధికారత, భద్రత, స్వయం సహాయక సంఘాల బలోపేతం వంటి అంశాలపై నిరంతరం పనిచేస్తానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు.

## సమాజం పట్ల దయ,క్షమాగుణం కలిగి ఉండాలి



**చల్లపల్లి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏసుక్రీస్తు బోధనలను జీవితానికి అన్వయించుకొని ప్రతి ఒక్కరూ సమాజం పట్ల దయ,క్షమాగుణం కలిగి ఉండాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు.పురిటిగడ్డ లోని సీఎస్ఐ చర్చి పదవ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్ బాబు మాట్లాడుతూ ఇతరులు మనకేమి చేయాలని కోరుకుంటామో అదే ఇతరులకు మనం చేయాలని చెప్పటమే ఏసుక్రీస్తు బోధనలలో ప్రధాన సారాంశమని తెలిపారు.సాటివారి పట్ల భేదభావం,అసూయ ద్వేషాలను కలిగి ఉండటం క్రైస్తవ మతానికి వ్యతిరేకమన్నారు.ప్రార్ధనా మందిరాలలో పాస్టర్లు బోధించే అంశాలను ప్రతి ఒక్కరూ నిత్య జీవితాలకు అన్వయించుకొని ఆచరించాలన్నారు.ప్రశాంతమైన జీవనవిధానానికి క్రీస్తు బోధనలు దోహదపడతాయని సురేష్ బాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజ,పాస్టర్లు కె.సురేష్,కల్యాణి,కమిటి సభ్యులు కంభం రాజు,కర్రా రవి కుమార్,కనిగంటి సాంబశివరావు,దయా కిరణ్,పల్లెకొండ సుధాకర్,హేమలత తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467